ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శనివారం 16 మార్చి 2024

• నేడు పొట్టి శ్రీరాములు జయంతి

అమరజీవి ఆత్మార్పణే ఆంధ్రరాష్ట్రం



తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక అమరజీవి పొట్టిశ్రీరాములు. ఆయన ఆత్మార్పణ వల్లే మన ఆంధ్ర రాష్ట్రం పురుడుపోసుకుంది. దేశంలో భాషాప్రయోక్త రాష్ట్రాలకు బాటలు వేసిన ఆ మహనీయుడు నెల్లూరీయుడు కావడం మనకందరికీ గర్వకారణం. పొట్టిశ్రీరాములు కుటుంబం నెల్లూరు జిల్లాలోని పడమటిపల్లెకు చెందినది. ఇక్కడి నుంచి మద్రాసుకు వలసవెళ్లారు. 1901 మార్చి 16న మద్రాసు నగరంలో శ్రీరాములు జన్మించారు. ఆయన జీవించిన 52 సంవత్సరాల్లో తొలి 20 ఏళ్లు మద్రాసులోనే గడిపారు. చెన్నైలోనే పాఠశాల విద్యను అభ్యసించారు. ముంబైలో ఇంజనీరింగ్ చేశారు. గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. తన 25వ ఏట భార్య, కుమారుడు మరణించడంతో మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమంలో చేరారు. బాపూజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ నినాదాలకు ఆకర్షితుడై ఆయన ఆశయాల సాధనకు జీవితాంతం కృషి చేశారు. శ్రీరాములు అంకితభావంతో పనిచేయడాన్ని గుర్తించిన మహాత్మాగాంధీ నాకు శ్రీరాములు వంటి 11 మంది అనుచరులు ఉంటే ఒక్క సంవత్సరంలోనే బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేవాడినని వ్యాఖ్యానించారు.

1946లో శ్రీరాములు నెల్లూరుకు వచ్చారు. దళితుల సంక్షేమం కోసం పనిచేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఖాదీ గ్రామ పరిశ్రమలను ప్రోత్సహించారు. 1946 -1948 మధ్య దళితులకు ఆలయ ప్రవేశం కోసం నెల్లూరులోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట మూడు సార్లు నిరాహార దీక్ష చేసి హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించారు. 1912లోనే భాషాప్రయోక్త రాష్ట్రాలు కావాలనే డిమాండ్ దేశంలోని పలు ప్రాంతాల్లో ఉంది. దీనికితోడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు వారంటే చిన్నచూపును గుర్తించిన పొట్టిశ్రీరాములు తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రత్యేక రాష్ట్ర సాధనను లక్ష్యంగా ఎంచుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1952 అక్టోబరు 19న చెన్నైలోని బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. సాధారణంగా ప్రారంభమైన ఈ దీక్ష క్రమక్రమంగా ప్రజల్లో అలజడి రేపింది. ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ మాత్రం ఈ దీక్షను సమర్థించలేదు. 1952 డిసెంబరు 15 అర్ధరాత్రి ఆశయ సాధనలోనే శ్రీరాములు అమరుడైనాడు. అనంతరం ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ డిసెంబరు 19న ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తూ ప్రకటన చేశారు. స్వాతంత్ర్య సమర యోధుడు జతిన్‌దాస్ తర్వాత అత్యంత సుదీర్ఘ కాలం నిరాహార దీక్ష చేసిన ఘనత పొట్టిశ్రీరాములుకే దక్కింది. అమరజీవి త్యాగఫలంతో ప్రత్యేక రాష్ట్రంలో పదవులు పొందిన ప్రజాప్రతినిధులు ఆయనను మాత్రం మరిచిపోయారు. పొట్టిశ్రీరాములుకు భారతరత్న సాధించడంలో విఫలమయ్యారు. పార్లమెంటులో అమరజీవి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయడం లేదనే విమర్శలున్నాయి. పొట్టిశ్రీరాములు జయంతి, వర్ధంతి రోజులను సెలవు దినంగా ప్రకటించి, ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించ డంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు అభిమానులు ఆగ్రహిస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

13 కేంద్రాల్లో ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్ష

• రేపు నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు
• పరీక్ష రాయనున్న 6,954 మంది అభ్యర్థులు



అధికారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వో లవన్న

నెల్లూరు (హరనాథపురం), మార్చి 15 : ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్ష ఆదివారం జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాలలో జరగనుంది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరగనున్న ఈ పరీక్షకు 6,954 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. హాల్ టికెట్టుతోపాటు, ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాల్సి ఉంటుంది. మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరా లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. ఈ పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో 0861-2331261 నెంబరుతోకాల్ సెంటర్ ఏర్పాటు చేశారు.

• పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం

ఏపీపీఎస్సీ గ్రూపు-1 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్వో లవన్న చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా కేంద్రాలలో మంచినీరు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయించాలని సూచించారు. అంతేగాక కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు ఆరోగ్యరాణి, ఆర్. సునీత పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం) : 6.25
సహరి (ఆదివారం) : 4.53

• పార్లమెంట్ పరిధిలో 50 శాతం మంది కొత్త అభ్యర్థులు • దశాబ్ద కాలం తరువాత తెరపైకి కొత్త తరం

రాజకీయాల్లో నవశకం

నెల్లూరు రాజకీయాల్లో కొత్తశకం మొదలయ్యింది. రెండు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికల్లో కొత్త అభ్యర్థులను రంగంలోకి దించాయి. నెల్లూరు పార్లమెంట్, దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎనిమిది మంది కొత్త ముఖాలు తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికలను ఎదుర్కొంటున్నాయి. 1985 తరువాత ఒకేసారి ఇంత మంది కొత్త అభ్యర్థులు రాజకీయ రణరంగంలోకి దిగడం ఇదే ప్రథమంగా తెలుస్తోంది. వైసీపీ ఆవిర్భావం సందర్భంగా 2014లో పలువురు కొత్త వ్యక్తులు ఎన్నికల బరిలోకి దిగినా ఇంత పెద్ద సంఖ్యలో లేకపోవడం గమనార్హం.



వీపీఆర్, ప్రశాంతి రెడ్డి, కావ్య, కాకర్ల సురేష్, ఇంటూరి, ఖలీల్, రాజగోపాల్‌రెడ్డి, విజయసాయి

నెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డి ఇద్దరూ రాజ్యసభ సభ్యులే అయినా ప్రత్యక్ష ఎన్నికల్లో తొలిసారిగా తలపడుతు న్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందిన వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఆరేళ్ల క్రితం రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాల్లోకి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కూడా రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు కానీ ఇప్పటివరకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. అనివార్య పరిస్థితుల్లో ఆయన కూడా నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీలో నిలిచారు. నెల్లూరు పార్లమెంట్ జనరల్ స్థానానికి మారిన తరువాత ఎక్కువ కాలం మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తాజాగా ఆదాల ప్రభాకరరెడ్డి శకం నడిచాయి. ఇప్పుడు ఈ రెండు కుటుంబాలు ఎంపీ తెరపై నుంచి తప్పుకుని, కొత్తశకం సృష్టించడానికి వీపీఆర్, వీఎస్ఆర్‌లు తలపడుతున్నారు.

ఉదయగిరి : గడిచిన మూడు ఎన్నికల్లో ఉదయగిరి తెలుగుదేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు శకం నడిచింది. ప్రస్తుతం టీడీపీ టిక్కెట్టు దక్కించుకున్న కాకర్ల సురేష్ శకం మొదలయ్యింది. మరోవైపు ఈ నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం చక్రం తిప్పిన ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శకం ఈ ఎన్నికలతో ముగిసింది. వైసీపీ అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శకం మొదలయ్యింది. విశేషమేంటే ఉదయగిరిలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేస్తున్నారు.

కావలి : గత రెండు దశాబ్దాలుగా కావలి రాజకీయాల్లో బీద, రామిరెడ్డి కుటుంబాల పెత్తనం నడుస్తోంది. వైసీపీ విషయానికి వస్తే ఇక్కడ పెద్దగా మార్పేమీ లేదు. ఈ ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డే పోటీ చేస్తున్నారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆ పార్టీ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జిగా, రాష్ట్ర పార్టీలో క్రియాశీల నాయకుడిగా బిజీ అయ్యారు. దీంతో ఆయన కావలి నుంచి పోటీ ఆలోచనను విరమించుకోవాల్సి వచ్చింది. ఈ పార్టీ అభ్యర్థి దగుమాటి కృష్ణారెడ్డి (అలియాస్ కావ్య కృష్ణారెడ్డి) తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

కోవూరు : సుదీర్ఘ కాలంగా కోవూరు నియోజకవర్గం ప్రధాన పార్టీల్లో పోలంరెడ్డి, నల్లపరెడ్డి కుటుంబాల ఆదిపత్యమే నడిచింది. ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోవూరు అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో కోవూరు టీడీపీలో వేమిరెడ్డి శకం ఆరంభమయ్యింది.

నెల్లూరు : నెల్లూరు సిటీ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ శకం ఈ ఎన్నికలతో ముగిసింది. వైసీపీ అభ్యర్థిగా మహ్మద్ ఖలీల్ తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. మరోవైపు కొత్త అధ్యాయం సృష్టించడానికి టీడీపీ అభ్యర్థిగా పొంగూరు నారాయణ బరిలో నిలిచారు.

కందుకూరు : ఈ నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం చక్రం తిప్పిన ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శకం ఈ ఎన్నికలతో ముగిసింది. ఈసారి వైసీపీ ఈయనకు టికెట్టు ఇవ్వడానికి నిరాకరించింది. తెలుగుదేశంలో ఇంటూరి శకం మొదలయ్యింది. టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ కందుకూరుకు కొత్త అయినా, కనిగిరి ఎమ్మెల్యేగా ఈయనది పాతమొహమే.

మొత్తమ్మీద 2024 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఎనిమిది మంది తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలో తలపడుతున్నారు. వారి వారి నియోజకవర్గాల్లో కొత్త శకాన్ని, చరిత్రను సృష్టించడానికి సన్నద్ధమయ్యారు.

ఎన్నికలకు సర్వం సన్నద్ధం!

నేడు షెడ్యూలు ప్రకటించనున్న కమిషన్

ఆ వెంటనే కోడ్ అమలులోకి..

నెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికలు రానే వచ్చాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం మధ్యాహ్నం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనుండగా, ఆ వెంటనే కోడ్ అమలులోకి రానుంది. జిల్లాలో మూడు నెలలుగా ఎన్నికల వాతావరణం నెలకొనగా, ప్రధాన పార్టీలు బరిలో నిలిచే అభ్యర్థులను సైతం ప్రకటించేశాయి. ఈ మేరకు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టేశారు. ఈ నెల ఆరంభం నుంచే ఇటు రాజకీయ నాయకులు అటు ప్రజలు ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తూ వచ్చారు. 2019లో మార్చి 10వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగా, ఈసారి ఒక రోజు అటూ ఇటుగా షెడ్యూల్ ప్రకటిస్తారని అంతా ఊహించారు. గతంతో పోల్చితే ఆరు రోజులు ఆలస్యంగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయనుంది. ఆ మరుసటి నిమిషం నుంచే దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుంది. 2019లో తొలివిడతలో అంటే ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రంలో పోలింగ్ జరిగింది. ఈసారి కూడా తొలిఫేజ్‌లోనే ఎన్నికలు జరుపుతారా!? లేదా అన్నది నేడు స్పష్టం రానుంది.

• అన్ని ఏర్పాట్లు పూర్తి

ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసుకుంది. 19,13,549 మంది ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు అవసరమైన 2,317 పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద కావాల్సిన ఏర్పాట్లు, ఈవీఎంల పరిశీలన పూర్తయ్యింది. దశలవారీగా ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం సన్నద్ధమయ్యింది. కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకొని నియోజకవర్గ కేంద్రాల్లో కవాతు నిర్వహించాయి. పోలింగ్ నాటికి మరిన్ని బెలాలియన్లు, ఆర్మ్‌డు ఫోర్స్ జిల్లాకు చేరుకోనుంది. రాజకీయ పార్టీలు బూత్‌లెవల్‌లో ఏజెంట్లను నియమించుకున్నాయి. టీడీపీ 2,263, వైసీపీ 2,225 మంది బీఎల్‌ఏలను నియమించుకున్నాయి.

అంగన్‌వాడీలపై కేసులు ఉన్నాయా!?

• వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు

ఉదయగిరి రూరల్, మార్చి 15: జిల్లావ్యాప్తం గా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై పోలీస్ స్టేషనులో కేసులు నమోదై ఉన్నాయా!? అని రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రాజెక్టు కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో ఆ వివరాల సేకరణలో అధికారులు ఉన్నారు. ఒకవేళ అంగన్‌వాడీలపై కేసులు నమోదై ఉంటే సదరు ఎఫ్ఐఆర్ కాపీలతోపాటు సమగ్ర వివరాలు పంపాలంటూ సూచించింది. అందులో భాగంగా సీడీపీవోలు కేసుల వివరాలను ఆరా తీసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, 2,673 అంగన్‌వాడీ కార్యకర్తలు, 2,665 మంది సహాయకులు విధులు నిర్వహిస్తున్నారు. తమ డిమండ్ల సాధన కోసం గతేడాది డిసెంబరు 12 నుంచి జనవరి 21వ తేదీ వరకు అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రాజెక్టు, తహసీల్దారు కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు తదితర ప్రాంతాల్లో ఆందోళన చేపట్టడంతోపాటు ప్రజాప్రతినిధుల నివాసాలను ముట్టడించారు. ఈ క్రమంలో చాలా మందిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. కేసుల పేరుతో ఎన్నికల్లో వారిని ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయగిరి సీడీపీవో లావణ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఏమైనా కేసులు ఉన్నాయా, ఉంటే నివేదికలు పంపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అయితే, తమ ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి కేసులు నమోదు కాలేదని, ఈ సమాచారాన్ని అధికారులకు నివేదించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

• నామినేషన్ కేంద్రాల్లోకి నలుగురికే అనుమతి
• ఈఆర్ఓలు, పోలీసు అధికారుల సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 15 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏవిధమైన ఫిర్యాదులు రాకుండా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలో లైన్లు ఏర్పాటు చేయాలని, అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే అనుమతించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల నిర్వహణలో డీఎస్పీలు పటిష్టవంతంగా పనిచేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, కందుకూరు రిటర్నింగ్ అధికారి విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు పైసలెలా!?


మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నా పదవ తరగతి వార్షిక పరీక్షలకు నిధుల సమస్య వేధిస్తోంది. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విషయాన్ని బయటకు పొక్కనీయకుండా ఏర్పాట్లకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కేవలం ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల విధులకు మాత్రమే నిధులు విడుదల చేస్తున్నట్లు విద్యాశాఖ సిబ్బంది తెలిపారు. ఇక కేంద్రాల్లో వసతుల కల్పన కోసం తల్లిదండ్రుల కమిటీలు చందాలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

• 18 నుంచి పదో తరగతి పరీక్షలు
• విడుదలకు నోచుకోని పరీక్షల గ్రాంట్
• విద్యా శాఖ విజ్ఞప్తిని పట్టించుకోని ప్రభుత్వం
• ప్రైవేట్ యాజమాన్యాలతోనే వసతుల కల్పన
• ప్రభుత్వ స్కూళ్లలో చందాల వసూలు

నెల్లూరు (విద్య) మార్చి 15 : పరీక్ష ఫీజుల పేరుతో పదోతరగతి విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నా పరీక్ష కేంద్రాల్లో వసతులు మాత్రం నామమాత్రంగా ఉంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. వసతుల కల్పనకు, పరీక్షల విధులకు ఖర్చు చేయాల్సిన నిధులు తూతూమంత్రంగా వెచ్చిస్తూ పరీక్షల విభాగం ఉన్నతాధికారులు, సిబ్బంది లక్షలాది రూపాయలు పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలకమైన వార్షిక పరీక్షలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.125 (ఎలాంటి రుసుము లేకుండా) వసూలు చేశారు. ఫీజులు ఆలస్యంగా చెల్లించే వారి నుంచి అపరాధ రుసుము పేరుతో మరికొంత అదనంగా కట్టించుకున్నారు. ఇలా రూ.80 లక్షలకుపైగా పరీక్ష ఫీజుల వసూలు చేయగా, మరో 5లక్షల వరకు అపరాధ రుసుము వచ్చినట్లు సమాచారం. జిల్లాలో ఈ ఏడాది 34,078 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతుండగా, 176 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. వసూలైన నిధులతో పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు విధుల నిర్వహణలో ఉన్నవారికి భత్యం చెల్లించాలి. అయితే వసూలు చేసిన మొత్తంలో నుంచి కనీసం 10శాతం కూడా వెచ్చించడం లేదన్నది వాస్తవం.

• ఖర్చంతా కాగితాల్లోనే..

ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థుల నుంచి ఫీజుల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తోంది. అయితే, పరీక్షల సమయంలో తూతూమంత్రంగా నిధులు విడుదల చేస్తూ అత్యధికంగా ప్రైవేట్ స్కూళ్లపై బాధ్యతలు మోపుతు న్నారు. కానీ ప్రభుత్వానికి అందించే లెక్కల్లో మాత్రం రూ.లక్షలు వెచ్చించినట్లు చూపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో విద్యార్థికి చొప్పున వసతుల నిమిత్తం నిధులు కేటాయించాలి. అలాగే, స్టేషనరీ, గుడ్డసంచులు, ప్రొఫార్మాలు, కట్టర్, బోల్డ్ మార్కర్‌లు, పాల ధీన్ కవర్లు, గమ్, పెట్టెలకు తాళాలు, సూది, దారం, స్కేల్, లక్క, ఇతర స్టేషనరీ కోసం నిధులు ఖర్చు చేయాలి. గతంలో ఒక్కో విద్యార్థికి కేవలం రూ.2 మాత్రమే చెల్లించేవారు. దీన్ని 2016లో రూ.5, 2019లో రూ.8లకు పెంచారు. ఈ ఏడాది దీన్ని రూ.12లకు పెంచాలని ప్రతిపాదనలు పంపినా పాత పద్ధతిలోనే చెల్లించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒక పరీక్ష కేంద్రంలో వందమంది విద్యార్థులు ఉంటే వసతుల కల్పనకు రూ.800 చొప్పున చెల్లిస్తు న్నారు. జిల్లాలోని 176 కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా ఆయా కేంద్రాల సామ ర్థ్యాన్ని బట్టి కేటాయింపులు చేస్తున్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి నిధులు కూడా వెచ్చించాలి. అయితే, ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పరీక్షలు నిర్వ హించే సెంటర్లను ప్రైవేట్ స్కూళ్లలో అధికంగా ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్ సెంటర్లలో వసతులన్నీ కూడా ఆయా పాఠశాలల యాజమాన్యాలే భరించాల్సి ఉంటుందని, కానీ లెక్కల్లో మాత్రం నిధులు వెచ్చించినట్లు చూపు తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది పరీక్షల నిర్వహణకు రూ.80లక్షలు విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఇప్పటికీ ఎలాంటి ఉత్తర్వులు వెలువడ లేదు. దీంతో విద్యాశాఖ అధికారులు ఇతర శాఖల నుంచి నిధులు విడుదల చేయించుకునే పనిలో నిమజ్ఞమై ఉన్నట్లు ఆ శాఖ సిబ్బందే చెప్పడం విశేషం.



మళ్లీ ఎప్పుడు కలుస్తామో...!

ఇన్నాళ్లూ కలిసి మెలిసి చదువుకున్న ఆ విద్యార్థులంతా మదినిండా బాధతో వీడ్కోలు చెప్పుకున్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారంతో పూర్తయ్యాయి. పరీక్ష కేంద్రాలు, కళాశాలల వద్ద విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఓవైపు పరీక్షలు పూర్తయ్యాయన్న ఆనందం.. మరోవైపు మిత్రులం విడిపోతున్నా మనే బాధ వారిలో కనిపించిం ది. బరువెక్కిన గుండెతో మళ్లీ ఎప్పుడు కలుస్తాం నేస్తమా అంటూ ఒకరినొకరు ఆత్మీయంగా అలింగనం చేసుకున్నారు. దూర ప్రాంతాలు, పల్లెల నుంచి చదువు నిమిత్తం నగరానికి, పట్టణాలకు వచ్చిన విద్యార్థులు రెండేళ్లపాటు హాస్టళ్లలో ఉండి కలిసి చదువుకున్నారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్వగ్రామాలకు పయనమయ్యారు.

• మదినిండా బాధతో స్నేహితుల వీడ్కోలు
• పూర్తయిన ఇంటర్మీడియట్ పరీక్షలు
• రోడ్లపై కాగితాలు విసిరేస్తూ కేరింతలు
• కిటకిటలాడిన బస్టాండ్, రైల్వేస్టేషన్లు



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



సర్వోదయ కళాశాల సమీపంలో ఇంటర్ విద్యార్థుల సందడి

పక్షం రోజులుగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. స్నేహితులతో కలిసి చిందులు వేశారు. హోటళ్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు, సినిమా హాళ్లకు వెళ్లారు. కాగితాలు చింపి బస్సుల్లో నుంచి రోడ్డుపై విసిరేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్ పరీక్షలు పూర్తవడంతో ఇతర ప్రాంతాల నుంచి నెల్లూరుకు వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు స్వస్థలాలకు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. కాగా, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శుక్రవారం ద్వితీయ సంవత్సరం వారికి జనరల్ కెమిస్ట్రీ-2, కామర్స్-2, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 22,319 మందికిగాను 21,819 మంది హాజరుకాగా 500 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 461 మందికి 360 మంది హాజరుకాగా 101 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 22,780 మంది విద్యార్థులకు 22,179 మంది హాజరయ్యారు. 601 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు, డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు, స్క్వాడ్ కలిపి 43 కేంద్రాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా, ఇంటర్ విద్యార్థులకు ప్రధాన పరీ క్షలు పూర్తయిన ప్పటికీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ బ్రిడ్జి కోర్సు, మోడర్న్ లాంగ్వేజ్, జాగ్రఫీ పరీక్షలు జరగాల్సి ఉంది.



- నెల్లూరు (విద్య)

మూడేళ్లుగా ఆసరా అందితే ఒట్టు!

● చేయూత సభలో పొదుపు మహిళల ఆవేదన

జగన్ సర్కారు ఎంతో గొప్పగా చెబుతున్న ఆసరా నిధులు తమకు మూడేళ్లుగా అందడం లేదని కలువాయికి చెందిన సాయిబాబా పొదుపు గ్రూపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం అధికారుల చుట్టూ తిరిగి కాళ్లు అరిగిపోతున్నాయని వారు అంటున్నారు. శుక్రవారం కలువాయిలోని ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో అధికారులు వైయస్ ఆర్ నాల్గవ విడత చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమం జరగ్గా, భారీగా పొదుపు మహిళలను సమీకరించారు. అయితే మూడేళ్లుగా ఆసరా, సున్నా వడ్డీ నిధులు అందడం లేదని సాయిబాబా పొదుపు గ్రూపు సభ్యులు వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బందిని చేయూత సభలోనే నిలదీశారు. ఏపీఎం స్రవంతి మాట్లాడుతూ ఆసరా నిధులు అందని విషయం ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రయత్నిస్తూనే ఉన్నట్లు చెప్పారు.

- కలువాయి



వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందిని నిలదీస్తున్న పొదుపు మహిళలు

'క్రిటికల్ కేర్'కు నిధుల కొరత

నెల్లూరు (వైద్యం) మార్చి 15: రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవటంతో క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్య పరికరాల ఏర్పాటు ప్రశ్నార్థకరంగా మారింది. మరో కొన్ని రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుండటంతో రాష్ట్రం నిధులు వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం కేంద్రం నిధులతోనే భవన నిర్మాణాలు సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను విడుదల చేయలేదు. కేంద్రం అనుమతి ఇచ్చి ఏడాదిన్నర అయినా ఇంతవరకు తన వాటా కింద రాష్ట్రం నిధులు ఇవ్వలేదు. ఇదిలాఉంటే కేంద్రం నిధులతో నిర్మాణాలు ప్రారంభించకపోతే ఆ నిధులు ఎక్కడ వెనక్కు వెళతాయోనన్న ఉద్దేశంతో అప్పట్లో అధికారులు హడావిడిగా టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపట్టారు.

● 60:40 పద్ధతిలో..

ఆయుష్మాన్ భారత్ కింద జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. మొత్తం రూ. 23.75 కోట్లతో దీని నిర్మాణం చేపట్టాలని యోచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 పద్ధతిలో భవనాలు నిర్మించాలని నిర్ణయించింది.



నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ భవనం

- జీజీహెచ్‌లో రూ.14.25 కోట్లతో నిర్మాణం
- ఇప్పటివరకు కేంద్రం డబ్బులే దిక్కు
- మొత్తం నిర్మాణానికి, పరికరాలకు రూ.23.75 కోట్లు
- రాష్ట్రప్రభుత్వం తనవాటాగా విడుదల చేయని రూ.9.50 కోట్లు
- అవి మంజూరు చేస్తేనే అందుబాటులోకి...

ఇందుకు తన వాటా కింద కేంద్రం 2022 నవంబరులోనే రూ. 14.25 కోట్లు విడుదల చేసింది. నాలుగు నెలలు ఆలస్యంగా పనులు ప్రారంభించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 9.50 కోట్లు మాత్రం నేటికీ విడుదల కాలేదు. ఈ నిధులు ఎప్పుడు విడుదల అవుతాయో చెప్పలేమని అధికారులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ఈ నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తోంది.

● వైద్య పరికరాలకు నిధులేవి ?

కాగా క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఆధునిక పరికరాల కోసం మొత్తం రూ. 23.75 కోట్లకుగాను రూ. 7.12 కేటాయించారు. ఒకవేళ భవన నిర్మాణాలు పూర్తి అయిన తర్వాత రాష్ట్రం నిధులు విడుదల చేస్తుందా ? అంటే ఎలాంటి స్పందన లేదు. జీజీహెచ్ డయోగ్నోస్టిక్ ల్యాబ్ వెనుక వైపున ఉన్న స్థలంలో ఈ క్రిటికల్ కేర్ భవనాన్ని నిర్మిస్తున్నారు. క్రిటికల్ కేర్ విభాగంతోపాటు అదనంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే, రెండు పడకల తల్లీబిడ్డల గది, ఐదు పడకల ఎమర్జెన్సీ విభాగం, రెండు పడకల చిన్నపిల్లల విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే 30 పడకల సాధారణ రోగుల వార్డు, 10 పడకల ఐసీయూను కూడా ఏర్పాటు చేయనున్నారు. రెండవ అంతస్తులో స్టెరిలైజేషన్‌తోపాటు రెండు ఆధునాతన ఆపరేషన్ థియేటర్లు నిర్మించనున్నారు. నిర్మాణపు పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే అవి పూర్తయ్యేలోపుగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 40 శాతం నిధులు విడుదల చేయకపోతే ప్రయోజనం ఉండదని వైద్యాధికారులు అంటున్నారు.

త్వరలో రాష్ట్రం వాటా నిధులు వచ్చే అవకాశం

క్రిటికల్ కేర్ భవనం నిర్మాణం పూర్తయితే వైద్య పరికరాల కోసం రాష్ట్రం వాటా నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. భవనాలు పూర్తయ్యేలోపు ఆధునిక ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన వైద్యపరికరా లతోపాటు ఇతర పరికరాలు కూడా కొనుగోలు చేస్తాం.

- సాంబశివరావు, (ఏపీఎంఎస్ఐడీపీ డీఈఈ)

నగలు దోచుకెళ్లిన నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం): వృద్ధురాలిని బెదిరించి నగలు దోచుకెళ్లిన నిందితుడిని చిన్నబజారు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు... జిల్లాలోని ఏఎస్‌పేట మండలం పెద్దూరు గ్రామానికి చెందిన కే శ్రీదేవమ్మ, వెంకట శేషారెడ్డి దంపతులు ఈనెల 13వ తేదీ నెల్లూరు పొగతోటలోని ఓ ఆస్పత్రికి వచ్చారు. అక్కడ చికిత్స చేయించుకుని ఆర్టీసీ బస్టాండుకు నడిచి వెళుతుండగా గుర్తు తెలియని దుండగుడు శ్రీదేవమ్మను అడ్డుకుని కత్తితో చంపు తామని బెదిరించారు. ఆమె వద్దనున్న 53 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. ఈ నెల 14వ తేదీన బాధితు రాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుధీర్ కుమార్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా దోపిడీ జరిగిన ప్రదేశంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి నిందితుడు నాయుడుపేట మండలం తుమ్మూరు గ్రామానికి చెందిన గిరిబాబుగా గుర్తించారు. శుక్రవారం నిందితుడిని గాంధీబొమ్మ సెంటర్‌లో అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి దోపిడీ సొత్తును స్వాధీనం చేసు కున్నారు.

జీజీహెచ్‌కు 20 వీల్‌చైర్ల వితరణ



వీల్‌చైర్ అందించిన దాతలను సన్మానిస్తున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), మార్చి 15 : ప్రభుత్వం జనరల్ ఆసుపత్రికి 10 మంది స్నేహితులు రూ.లక్ష విలువ చేసే 20 వీల్‌చైర్లను వితరణ చేశారు. వీటిని శుక్రవారం జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద ద్వారా ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్‌కు అందించారు. సునంద మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, వీల్‌చైర్ల వాడకం ఎక్కువవటం వల్ల ఉన్నవి మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. ఈ పరిస్థితిని తాను వివరించగా కోట జనార్దన్‌రెడ్డి, మంతు వెంకటేశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వేణు, మురళీకృష్ణా రెడ్డి, సతీష్, దిలీప్‌కుమార్, మురళీ, సురేష్, ఎండీఆర్‌రెడ్డి తదితర మిత్రబృందం వీల్‌చైర్లను వితరణ చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, వైద్యులు కళారాణి, మస్తాన్‌బాషా, గంగాధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ



సర్టిఫికెట్లు అందుకున్న అధ్యాపకులు

నెల్లూరు (విద్య), మార్చి 15 : జిల్లాలోని వివిధ ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న జంతు శాస్త్రం, జీవసాం కేతిక శాస్త్రం, జీవరసాయన శాస్త్రం అధ్యాపకు లకు నెల్లూరులోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు వివిధ అంశాలపై అడ్వాన్స్ రీసెర్చ్ ఎలా నిర్వహించాలో ఆన్‌లైన్ ద్వారా వివరించారు. నూతన విద్యానైపుణ్యాలను అధ్యాపకులకు నేర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి అధ్యాపకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీరంజని, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ గురుశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను రద్దు చేయాలి

● యూటీఎఫ్ నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు (విద్య), మార్చి 15 : జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల అక్రమ సిఫార్సు బదిలీల ను రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట శుక్ర వారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసి సాధించు కున్న ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ విధానానికి ప్రభుత్వమే తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1200 మంది ఉపాధ్యాయులకు అక్రమ బదిలీలు చేపట్టారని ఆరోపించారు. జిల్లాలో ప్రభుత్వ సిఫార్సు పేరుతో బదిలీలు జాబితా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరడంతో రహస్యంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సమయంలో హడావిడిగా పైరవీలతో ప్రభుత్వ సిఫార్సు నగ దు బదిలీలు చేపట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. వాటిని వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శి వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ, కోశాధికారి ఏ మురళీధర్‌రావు, కార్యదర్శులు కే నాగిరెడ్డి, జీ దయాకర్, ఎస్‌కే ఖాజావలి, నేతలు పాల్గొన్నారు.

బజాజ్ షోరూంలో చోరీ

● రూ.1.80 లక్షలు అపహరణ



చోరీ జరిగిన షోరూంలో క్యాష్ బాక్స్‌లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 15: జాతీయ రహదారి వెంబడి బజాజ్ షోరూంలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. గురువారం రాత్రి యజమాని, సిబ్బంది షోరూంను ఎప్పటిలాగా మూసేసుకుని వెళ్ళిపోయారు. శుక్రవారం ఉదయం షోరూం తెరిచేసరికి షోరూం పైకప్పు సీలింగ్ తొలగించి వుండడంతో యజమాని కూనంకి గిరీష్‌కుమార్ పరిశీలించగా దొంగలు క్యాష్ బాక్స్ తాళాలు పగలగొట్టి అందులోని 1.80లక్షలు రూపాయలు అపహరించినట్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ హైమారావు పరిశీలించారు. క్లూస్‌టీం చోరీ జరిగిన తీరు పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

లారీ తగిలి తెగిపడిన విద్యుత్ తీగ

● భయంతో పరుగులు తీసిన జనం

కలువాయి, మార్చి 15: స్థానిక బస్టాండు ప్రాంతంలో సోమశిల- పొదలకూరు ప్రధాన రోడ్డుపై విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం జామాయిల్ లోడ్‌తో వెళుతున్న లారీకి ఈ విద్యుత్ తీగ తాకడంతో తెగిపడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అదృష్టవశాత్తు తీగ తెగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇది చూసిన ప్రయాణికులు కేకలు వేయడంతో అక్కడ ఉన్న వారంతా భయంతో పరుగులు తీశారు. తరచూ హైయిట్ లోడ్‌తో వచ్చిన వాహనాలు తగిలి విద్యుత్ వైర్లు తెగిపడుతున్నాయి. ఇప్పటికే రెండు, మూడు సార్లు ఇలా విద్యుత్ తీగలు తెగిపడిన సంఘటనలు ఉన్నాయి. ఇది కాక ఇదే రోడ్డుపై పలు చోట్ల 11కేవీ విద్యుత్ లైన్లు కూడా తక్కువ ఎత్తులో వెళుతున్నాయి. ప్రజలు ఇక్కడ క్షణ క్షణం భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు

దగదర్తి(బిట్రగుంట), మార్చి 15: దగదర్తి మండలం చెన్నూరు గ్రామంలో ఈనెల 7వ తేదీన జరిగిన బాలుడి హత్య కేసులో నిందితుడు కత్తి రాముడుని అరెస్టు చేసినట్లు కావలి రూరల్ సీఐ నాగభూషణం శుక్రవారం రాత్రి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెంలో నివాసం ఉంటున్న శీను అనే వ్యక్తి తన రెండేళ్ల బాలుడితో చెన్నూరుకు వచ్చాడు. తన సమీప బంధువు అయిన కత్తి రాముడి వద్ద బాలుడిని వదిలి తిరిగి బుచ్చికి వెళ్లాడు. ఈ క్రమంలో ఈనెల 7వ తేదీన మల్లయ్య మిట్టలో జరుగుతున్న శివ రాత్రి ఉత్సవాలకు చెన్నూరుకు చెందిన భవానీ, ఆమె అన్న రాముడుతో పాటు శీను కుమారుడైన రెండేళ్ల బాలుడుని తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో బాలుడు అల్లరి చేస్తుండటంతో అల్లరి చేయవద్దని బలంగా కొట్ట డంతో స్పృహ కోల్పోయాడు. దీంతో ఆ బాలుడిని పంట కాలువలో పడేశారు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దన్ని భవానీని రాముడు భయపెట్టడంతో ఆమె నోరుమెదపలేదు. బాలుడి తండ్రి ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు తమదైన శైలిలో రాముడి సోదరి భవానీని, ఆమె సమీప బంధువు, సుబ్బయలను అదుపులోనికి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం బయట పడింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తునట్లు సీఐ నాగభూషణం తెలిపారు. ఆయన వెంట ఎస్సై మరిడినాయుడు, సిబ్బంది ఉన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	128
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6260
వెండి కిలో ధర	రూ. 76,000
వెండి ఒక గ్రాము	రూ. 78.00

అవకాశవాదులకు బుద్ధి చెప్పాలి

వైసీపీకి 151 సీట్లిస్తే పాలనలో వైఫల్యం

డీసీసీ అధ్యక్షుడు చేవూరు ● పార్టీ మండల అధ్యక్షులకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందిస్తున్న చేవూరు

నెల్లూరు (వైద్యం), మార్చి 15 : రాష్ట్రంలో అవకాశవాద రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ ఆస్తుల కమిటీ రాష్ట్ర చైర్మన్ చేవూరు దేవకుమార్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఇందిరాభవన్‌లో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడు తూ రాష్ట్ర ప్రజలు వైసీపీకి 151 అసెంబ్లీ సీట్లు ఇస్తే పాలనలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. మరొక పార్టీ ప్రజలకు మేలు చేస్తామని ఓట్ల కోసం ప్రచారం చేస్తోందని ఆరోపించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో పాచిపోయిన లడ్డూలంటూ బీజేపీని తీవ్రంగా విమర్శించి నేడు ఆ పార్టీతోనే జతకట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షర్మిల రాకతో రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు, అధికార ప్రతినిధి లేళ్లపాక సురేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నేతలు చింతాల వెంకట్రావు, నెట్రంబాక మోహన్‌రెడ్డి, జాలే వాసుదేవ నాయుడు, రమేష్ నాయుడు, నెల్లూరు సిటీ అధ్యక్షుడు ఫయాజ్, మోహన్, మంజుల, హుస్సేన్‌బాషా, అల్లాఉద్దీన్ యామాలరాజా తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి వివాదంలో మనుమరాలిపై కత్తితో దాడి

ఆత్మకూరు, మార్చి 15: పట్టణంలోని కందివీధిలో మనుమరాలిపై తాత కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఒకే కాలనీలోనే నివాసం ఉంటున్న స్వప్నపై ఆమె తాత వెంకటేశ్వర్లు ఆస్తి వివాదాల నేపథ్యంలో ఆమెపై దాడి చేయడంతో మూడుచోట్ల గాయాలయ్యాయి. దాంతో ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డైలీ కార్మికులను ఔట్‌సోర్సింగ్‌లో చేర్చాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కావలిటౌన్, మార్చి 15: డైలీ కార్మికులను ఔట్‌సోర్సింగ్‌లో చేర్చాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు రెహనా బేగం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. రెహనాబేగం మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి తక్కువ వేతనాలతో పని చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎక్కువ శాతం దళితులేనన్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన వారియర్స్ అని, అటువంటి వారిపై చిన్నచూపు చూడడం సమంజసం కాదన్నారు. సీఐటీయు గౌరవాధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ అధికారులు స్పందించి ఇప్పటికైనా ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. 27 మంది పారిశుధ్య కార్మికులను ఔట్‌సోర్సింగ్‌లో చేర్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ రెండు నెలల క్రితం ఇచ్చిన ఆర్డర్‌ను మున్సిపల్ అధికారులు గోప్యంగా ఉంచారన్నారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, పోలయ్య, షానవాజ్, తురకా శీనయ్య, రమేష్, మహేష్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరకాలువను పరిశీలించిన సీఈ, ఎస్ఈ



చిలకలమర్రి వద్ద కాలువను పరిశీలిస్తున్న సీఈ, ఎస్ఈ

అనంత సాగరం, మార్చి 15: సోమశిల ఉత్తరకాలువను శుక్రవారం తెలుగు గంగ సీఈ వెంకట రమణ, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణా రెడ్డి పరిశీలించారు. కాలువ సామర్థ్యం పెంపు కోసం జరిగే పనులకు అనుగుణంగా ఆత్మకూరు నుంచి సోమశిల జలాశయం వరకు కాలువ వెంబడి ప్రయాణించి నెలకొన్న ఉన్న అడ్డంకులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కొన్నిచోట్ల కల్వర్టులు దెబ్బతినడంతో పాటు నీటి ప్రవాహానికి నెలకొన్న అవాంతరాలను డిజైనింగ్ మార్పు చేసి కాలువ ఆధునికీకరణ చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. సోమశిల నుంచి రాళ్లపాడు రిజర్వాయర్ వరకు సజావుగా నీటి ప్రవాహం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఈ దశరథరామిరెడ్డి, జేఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సీఏఏను రద్దు చేసే వరకు పోరాటం

● వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), మార్చి 15 : పౌరసత్వ సవరణ బిల్లును (సీఏఏ) వెంటనే నిలిపేయాలని కోరుతూ వామపక్ష, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఏబీఎన్ కాంపౌండ్ నుంచి వీఆర్‌సీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ సీఏఏను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసేవరకు ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే విభజన రాజకీయాలకు బీజేపీ పాల్పడుతోందని దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ నేత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సీపీఐ నేత సిరాజ్, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు, మైనార్టీ నేత సయ్యద్ సమీ, సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు, క్రిస్టియన్ సంఘం నేత ఎలీసా, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, బత్తల కిష్టయ్య, నాగేశ్వరరావు, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్, ఐద్వా నగర కార్యదర్శి పద్మ, లాయర్ల సంఘం, పౌరహక్కుల సంఘం నేతలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

ఐటీడీఏ పీవోపై విచారణకు ఆదేశం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 15 : నెల్లూరు ఐటీడీఏ పీవోపై గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ మురళి విచా రణకు ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఆదేశాలను కలెక్టర్‌కు పంపారు. వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఐడీడీఏ పీవో నిధుల దుర్వినియోగం అంశమై ఫిర్యాదులు అందటంతో విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

ఆత్మగౌరవంలేని పార్టీలో ఉండలేకే...

● వైసీపీకి రాజీనామాపై కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు

కావలి, మార్చి 15 : వైసీపీలో తనను కార్యకర్తకన్నా హీనంగా చూస్తున్నారని, ఆత్మగౌరవంలేని పార్టీలో కొనసాగకూడదన్న ఉద్దేశంతో తన అనుచరుల అభిప్రాయం మేరకు వైసీపీకి రాజీ నామా చేసినట్లు కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర రాజకీయ సలహాకమిటీ సభ్యుడి పదవికి రాజీనామా చేసి, సదరు లేఖను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పంపుతున్నట్లు తెలిపారు. శుక్రవారం కావలిలోని తన కార్యాలయంలో వంటేరు విలేకరులతో మాట్లాడుతూ 2014లో వైసీపీలో చేరిన తాను అప్పట్లో కావలిలో వైసీపీ అభ్యర్థి విజయానికి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టిలతో కలిసి తాను కృషి చేసినట్లు చెప్పారు. ఎన్నికల తర్వాత తమను కావలి ఎమ్మెల్యే దూరంగా పెట్టారన్నారు. 2019లో ఉదయగిరి అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి కృషి చేయగా ఆయన కూడా తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. పదేళ్లపాటు వైసీపీలో కొనసాగినా అక్కడ గుర్తింపు లేకపోవటంతో విలువలు లేని పార్టీలో కొనసాగకూడదని నిర్ణయించుకుని వైసీపీకి రాజీనామా చేయటం జరిగిందన్నారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలో వెల్లడిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వంటేరు అనుచరులు పాతూరు రామిరెడ్డి, మెట్టుకూరు రాంజీ రెడ్డి, చేవూరు అజయకుమార్‌రెడ్డి, జేడీ మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



విష్ణుతో మాట్లాడుతున్న వంటేరు

● విష్ణుతో భేటీ

అల్లూరు : అల్లూరులోని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో వంటేరు కలిశారు. ఐదేళ్ల తర్వాత వీరిద్దరు కలవడంపై స్థానికంగా చర్చనీయాంశమైంది.

జెండా మోసే ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా

● ఆత్మీయ సమావేశంలో ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల


కొండాపురం: కాకర్ల సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొండాపురం, మార్చి 15: టీడీపీ జెండా మోసే ప్రతికార్యకర్త, నాయకులు, అభిమానులను అండగా ఉంటానని ఉదయగి టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ భరోసా ఇచ్చారు. శుక్రవారం పార్లపల్లిలో టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో రెండేళ్లుగా దాదాపు లక్ష కుటుంబాలను కలశానని, సుమారు 45 వేలమందికి కాకర్ల ట్రస్టు ద్వారా పలు రకాల సేవలందించానన్నారు. ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్యరథం 29వేల మందికి వైద్య పరీక్షలు, అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందించానన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరిస్తే మరింత సేవ చేస్తానని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. అంతకుముందు మండల పార్టీ నాయకులు కాకర్ల సురేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి, నెల్లూరు పార్లమెంటు అధికారప్రతినిధి యారవ క్రిష్ణయ్య, రైతు కార్యదర్శి పీ.రమేష్, నాయకులు నర్రా చెంచునాయుడు, గద్దె రాఘయ్య, పీ.తిమోతి, షేక్.ఖాసిం, సీహెచ్.క్రిష్ణ పాల్గొన్నారు.

వరికుంటపాడు: ప్రస్తుత పాలనలో అప్పుల ఆంధ్రను కాపాడి రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడు జనసేన, బీజేపీలతో పొత్తు నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. మండలంలో దౌర్జన్యంగా భూములు లాక్కోవడం, అరాచకాలు సృష్టించిన వారిని సంగతి తనకు తెలుసన్నారు. పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని వారందరి అకౌంట్లు త్వరలోనే సెటిల్ చేస్తానని చెప్పారు. మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకటరామారావు ఆశీస్సులతో ఆయన అడుగు జాడల్లోనే నడుస్తానన్నారు. తాజా, మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ చంచలబాబుయాదవ్‌ల సహకారంతో ముందుకు సాగుతానన్నారు. అనంతరం అధికార పార్టీకి చెందిన గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలను పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ చంద్ర మధుసూ దనరావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, కాకర్ల సునీల్, ముజ్జె లక్ష్మినారాయణ, పోలిబోయిన శ్రీకాంత్, పోకా మహేష్, నాదిండ్ల రాజేంద్ర, చంద్ర వెంకయ్య పాల్గొన్నారు.

సోమశిలలో 12.710 టీఎంసీల నిల్వ

అనంతసాగరం: సోమశిల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి జలాశయంలో 12.710 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తరకాలువకు 600, దక్షిణకాలువకు 450క్యూసెక్కులు సరఫరా అవుతున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా ఖాజారహమతుల్లా

ఏఎస్ పేట, మార్చి15: కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా గండువారిపల్లి షేక్ ఖాజారహమతుల్లాను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. శుక్రవారం జిల్లా నాయకుల నుంచి తనకు నియామకపత్రం వచ్చినట్లు తెలిపారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చేవూరు శ్రీధర్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

స్వతహాగా ఓటు వేయండి


కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మర్రిపాడు, మార్చి 15: ప్రతిఒక్కరూ స్వతహాగా తమ ఓటును వినియోగించుకోవాలని ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి కోరారు. శుక్రవారం కేంద్రబలగాలతో మర్రిపాడు, తిక్కవరం, పల్లవోలులో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేయనున్నట్లు, ఓటర్లకు ధైర్యాన్ని కల్పించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఉదయగిరి రూరల్, మార్చి 15: స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం సంఘబంధం సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై ఏపీఎం ఖాజారంతుల్లా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతు సాధికారిత సంస్థ సహకారంతో సంఘం అనుబంధ సభ్యులతో పురుగు మందులు లేకుండా సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులను సీసీలు పర్యవేక్షిస్తుండాలన్నారు.

బైపాస్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి రాఘవేంద్ర కల్యాణ మండపం వరకు పట్టణంలోకి వచ్చే బైపాస్‌రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నేతలు దేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు లక్కు క్రిష్ణప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, వాగాల శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

చేజర్ల, మార్చి 15: ఆదురుపల్లి త్రికోటేశ్వర విద్యాలయంలో శుక్రవారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరక్టర్ ఎం.సుధాకరరెడ్డి, కే.లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారిపైనే మురుగు..


ఉదయగిరి సుద్దబావి వీధిలో రోడ్డు దుస్థితి

ఉదయగిరి రూరల్: పట్టణంలోని సుద్దబావివీధిలో రహదారిపై మురుగు పారుతుండటంతో అడుగు వేసేందుకు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో రహదారిపై ప్రవహిస్తోంది. దీనికితోడు అక్కడ మురుగు నిల్వ చేరి దుర్వాసనతో పాటు దోమలకు నిలయంగా మారుతోందని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించినా ఫలితం లేదని మండిపడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు రహదారిపై రాకుండా చూడాలంటున్నారు.

జండాదిబ్బలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

సంగం, మార్చి 15: ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులు జండాదిబ్బలో ఇంటింటికి తిరిగారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


దుత్తలూరు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), : స్థానిక కమ్మవారిపాలెం సొసైటీ పీఏసీఎస్ ఆధ్వర్యంలో తెడ్డుపాడు, భైరవరం, నర్రవాడ రైతుభరోసా కేంద్రాల్లో శుక్రవారం అధికారులు ధాన్యంను కొనుగోలు చేశారు. ఆయా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకొన్న రైతులు కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర గ్రేడ్-ఏ రకం క్వింటాల్ రూ.2,203, పుట్టి రూ.18,752, సాధారణ రకం క్వింటాల్ రూ.రూ.2,183, పుట్టి రూ.18,555లకు కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు ఆర్.యశోద, వ్యవసాయాధికారి ఎన్.వెంకటసుబ్బారెడ్డి, సీఈవో లోకనాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈద్గాలో అభివృద్ధి పనులు ప్రారంభం


ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఉదయగిరి రూరల్: మండల నిధులతో ఈద్గా మసీద్ మౌలానా సయ్యద్ అఫ్రోజ్ శుక్రవారం స్థానిక ఈద్గా మైదానంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. బోరుతో పాటు ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. రంజాన్ మాసం ముగిసేలోపు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ సభ్యులు ఎంపీపీ మూలె పద్మజకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ.ఓబులరెడ్డి, ఉప సర్పంచ్ ముర్తుజా, ఎంపీటీసీ పెదమస్తానీ, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ యస్థాన్, ఉప్పుటూరి శ్రీనివాసులు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీపీఆర్‌ను కలిసేందుకు తరలిన టీడీపీ శ్రేణులు


నెల్లూరుకు తరలిన టీడీపీ శ్రేణులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 15: నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసేందుకు దుత్తలూరు నుంచి శుక్రవారం టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. దుత్తలూరు అన్నంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభి మానులు దుత్తలూరు సెంటర్‌లో బాణసంచా పేల్చి వేమిరెడ్డి, కాకర్ల సురేష్ జిందాబాద్ అంటూ నినాదా లతో హోరెత్తించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడాలని, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఘన విజయం సాధించాలని ఆలయాల్లో పూజలు చేశారు.

నేడు ఆత్మకూరులో ఆనం ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో శనివారం మధ్యాహ్నం 3.30గంటలకు ఆత్మకూరు నియోజకవర్గ తెలుగు యువత, ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి, ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని టీడీపీ నేతలు తెలిపారు.

చేజర్ల: ఆత్మకూరు రవితేజ కళ్యాణ మండపంలో ప్రొఫెషనల్స్ కనెక్ట్ విత్ లీడర్ కార్యక్రమానికి మండంలోని ఐటీ ఉద్యోగులు మరియు గ్రాడ్యుయేట్స్ తప్పకుండా హాజరు కావాలని తెలుగు ప్రొఫెషనల్స్‌వింగ్ సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీమంత్రి, ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు


ఉదయగిరి: పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, మార్చి 15: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ఏఆర్ఆర్ జూనియర్ కళా శాలలో ఈ నెల 1న ప్రారంభమైన ఇంటర్ ప్రథమ, 2న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చివరి పరీక్ష ముగియడంతో విద్యార్థులు ఆనందంగా స్వగ్రామాలకు తరలివెళ్లారు. చివరిరోజు 225మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఆరు మంది గైర్హాజరైనట్లు పరీక్షల సిబ్బంది తెలిపారు.

సంగం : స్థానిక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు చివరి పరీక్ష పూర్తయి పరీక్ష హాలు నుంచి బయటకు రాగానే కేరింతలు కొడుతూ హర్షం వ్యక్తం చేశారు. గురువారమే మొదటి సంవత్సర పరీక్షలు పూర్తవడంతో కళాశాలలోని బాలికలు ఇళ్లకు పయనమయ్యారు. దీంతో కళాశాల వద్ద సందడి నెలకొంది.

సీసీ రోడ్ల పనులకు భూమిపూజ


పూజ చేస్తున్న వెంకటనారాయణరెడ్డి

వరికుంటపాడు: గణేశ్వరాపురంలో రూ.20లక్షలతో చేపట్టిన 8పనులను శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరక్టర్ బాదం వెంకటనారాయణరెడ్డి భూమి పూజ చేశారు. కాంచెరువులో రూ.17లక్షలతో నిర్మించే ఐదు రోడ్లకు సర్పంచ్ మందలపు మల్లేశ్వరి, గువ్వాడిలో రూ.10లక్షలతో నిర్మించే రెండు రోడ్లకు సర్పంచు శేషం నాగభూషణం శంకుస్థాపన చేపట్టారు. సర్పంచు వడ్లపల్లి తిరుపతయ్య, సుబ్బ రాయుడు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వింజమూరు: మండలకేంద్రంతో పాటు తక్కెళ్లపాడులో సీసీరోడ్ల పనులకు శుక్రవారం సర్పంచ్ రొడ్డా వెంగమ్మ భూమిపూజ చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు కొండయ్య, ఎంపీటీసీ సభ్యులు గువ్వల మల్లికార్జున్, నాయకులు కొండపల్లి రమేష్, మద్దూరి చంద్రశేఖర్‌రెడ్డి, కొండలరావు, రమణయ్య పాల్గొన్నారు. వింజమూరు పర్యటించి ఉపాధి కూలీలతో ముచ్చటించారు. రేవు నూరి శ్రీనివాసులురెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన ఉన్నారు.

చేయూత చెక్కుల పంపిణీ

కలువాయి, మార్చి 15: స్థానిక ఉమామహేశ్వరి కల్యాణమండపంలో శుక్రవారం వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఎంపీఎం స్రవంతి, ఎం.కృష్ణారెడ్డి, మాదాసు యజ్ఞపవన్ పాల్గొన్నారు.

ఉదయగిరి: నెల్లూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని శుక్రవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): కొత్తపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు హరీష్, వెంకటసందీప్, అవినాష్, కోటేశ్వరరావులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. ఎంపీడీవో సాయిప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

జామాయిల్ తోట దగ్ధం

కందుకూరు: మున్సిపాలిటీలోని దూబగుంట సమీపంలో పీ.చెన్నయ్యకు చెందిన జామాయిల్ తోట శుక్రవారం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. తోటలో ఉన్న తుక్కుకుని ప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. తానంటే గిట్టనివాళ్లు నిప్పుపెట్టి ఉంటారని చెన్నయ్య ఆరోపించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గ్రహణం!

● తలుపులు తెరుచుకోని కేంద్రాలు ● పల్లెలో అందని వైద్యం


కొండసముద్రంలో మూసి ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్

వలేటివారిపాలెం, మార్చి 15 : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పల్లెల్లో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గ్రహణం పట్టింది. మండలంలో 14 విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆశా కార్యకర్తలను నియమించారు. ఆ కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించాల్సి ఉంది. అందులో గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. అయితే వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్య సిబ్బంది గ్రామాలకు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని కేంద్రాలైతే తలుపులు కూడా తీయడంలేదు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్నవారు ఉంటే వారి ఇంటికి వెళ్లి వైద్యం అందించాల్సి ఉండగా అది ఎక్కడా అమలు కావడం లేదు. ఆరోగ్య సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడడంతో పల్లెల్లో వైద్యం అందని ద్రాక్షాలా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ కేంద్రాలపై దృష్టి సారించి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

యువత బంగారు భవితకు చంద్రబాబు సీఎం కావాలి

● విద్యార్థులతో వీపీఆర్, కావ్య ముఖాముఖి


మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి వీపీఆర్


కావలి, మార్చి 15: యువత బంగారు భవిష్యత్‌కు బాటలు పడాలంటే ఒక విజన్ ఉన్న నేత నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టీడీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి హైద్రాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించింది చంద్రబాబు నాయుడన్నారు. అక్కడ ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు కలగటం ఆయన పుణ్యమన్నారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఈ వయస్సులో మంచి మార్గదర్శితో ముందుకు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులంతా వజ్రాయుధం లాంటి ఓటు అనే ఆయుధంతో మీ తొలి ఓటు ఎంపీ అభ్యర్థిగా తనకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా కావ్యకు వేయాలన్నారు. అనంతరం కావలి టీడీపీ కార్యాలయంలో జరిగిన పరిచయ కార్యక్రమంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని టీడీపీ, జనసేన నేతలకు కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాలేపాటి సుబ్బానాయుడు, రూపుకుమార్ యాదవ్, పోతుగంటి అలేఖ్య, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి, గుత్తికొండ క్రిషోర్ పాల్గొన్నారు.

తలనీలాల ద్వారా రూ.1,44,99,999 రాబడి


మాలకొండలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, మార్చి 15 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి భక్తులు సమర్పించిన తలనీలాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. దీని ద్వారా రూ.1,44,99,999 రాబడి వచ్చింది. మాలకొండ కళ్యాణ మండపంలో కందుకూరు గ్రూపు దేవాలయం కార్యనిర్వాహణాధికారి వై బైరాగి పర్యవేక్షణలో జరిగిన వేలంలో తిరుపతికి చెందిన గరుడ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధి రూ.1,44,99,999లకు దక్కించుకున్నారు. అయితే గత ఏడాది తలనీలాలు వేలం పాట రూ.2,16,99,999 పలకగా ఈ ఏడాది రూ.72 లక్షలు తగ్గింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి కేబీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలైన తిరుపతి, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, పెంచలకోన తదితర పుణ్యక్షేత్రాలలో కూడా తలనీలాలు వేలం పాటల ద్వారా ఆదాయం సగానికి పైగానే పడిపోయినట్లు తెలిపారు. మార్కెట్‌లో తలనీలాలకు డిమాండ్ లేనందున వ్యాపారులు తలనీలాలు పాటను పాడేందుకు ముందుకు రావడం లేదన్నారు. తిరుపతి, శ్రీశైలం, కనకదుర్గమ్మ, పెంచలకోన తదితర దేవాలయాలలో తలనీలాలు వేలం పాట తక్కువగా వస్తునందున వ్యాపారులు అటు వైపు మొగ్గు చూపుతున్నట్లు చెప్పారు. తిరుపతిలో ఇప్పటి వరకు 2 లక్షల కేజీలకు పైగానే తలనీలాలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కందుకూరులో టీడీపీ విజయం తథ్యం : ఇంటూరి


వలేటివారిపాలెం : నాగేశ్వరావును అభినందిస్తున్న శిఖామణి

కందుకూరు, మార్చి 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కందుకూరులో టీడీపీ విజయం తథ్యమని ఆ పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇప్పటికే ప్రజలు విసుగుచెందారని రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కేవలం చంద్రబాబునాయుడు వల్లనే సాధ్యమన్నారు. పరిశ్రమలు ఏర్పాటు, రాళ్లపాడు ఆయకట్టు రైతులకు సక్రమంగా నీరందించడం, రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు న్యాయం చేయడం లక్ష్యమన్నారు. కందుకూరుకు కొత్తగా వచ్చిన వ్యక్తి శాంతిభద్రతల గురించి ఏవేవో మాట్లాడుతున్నాడని, అలాంటి తప్పుడు ప్రచారాలు మానుకుంటే మంచిదన్నారు. నాకు ఇన్‌చార్జి పదవి, తాజాగా అభ్యర్థిత్వం ఖరారు కావడంలో సహరించిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాంకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి, టికెట్ కోసం పోటీపడ్డ సోదరుడు ఇంటూరి రాజేష్‌తో కలసి త్వరలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. ఈ సమావేశంలో కుసుమకుమారి, దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను విజయవంతం చేయండి : ఈనెల 17న బొప్పూడి సమీపంలో జరగనున్న ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

నాగేశ్వరావుకి అభినందన

వలేటివారిపాలెం : టీడీపీ కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు ఎంపికపై హర్షం వ్యక్తం చేసిన తెలుగు యువత మండల అధ్యక్షులు బద్దిపూడి శిఖామణి శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా వేసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నాగేశ్వరావుపై నమ్మకంతో టికెట్ కేటాయించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్థలం విషయంలో వివాదం

లింగసముద్రం, మార్చి 15 : మండలంలోని పెదపవనిలో ఓ స్థలం విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం ఓ వర్గానికి చెందిన కొందరు ఆ స్థలంలోకి వచ్చి ఈ స్థలం తమదంటూ ఓ బోర్డు ఏర్పాటు చేశారు. ఎక్స్‌కవేటర్ ద్వారా ఆ స్థలాన్ని బాగు చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన మరో వర్గం వారు ఈ స్థలం తమదని, ఇందుకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న తహసీల్దారు జీ.శ్రీచరణ్, డీటీ టీ.ప్రసాద్, కందుకూరు సీఐ షేక్ నసీఫ్‌బాషా, గుడ్లూరు ఎస్సై లక్ష్మణ్‌కుమార్, సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి ఇరువర్గాలను శాంతింపజేశారు. డాక్యుమెంట్లను పరిశీలించారు. స్థలం వివాదం సివిల్ కోర్టులో పరిష్కరించుకో వాలని సూచించారు.

జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం

బిట్రగుంట, మార్చి 15: బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీ, జక్కేపల్లి గూడూరు అరుంధతివాడలో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి, దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు రామోహన్‌రెడ్డి, నాటకరాణి శీనయ్య, రంగయ్య, కే.వెంకటేశ్వర్లురెడ్డి, పీ.క్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచు టీ.క్రిష్ణయ్య, వై.వేంకటేశ్వర్లురెడ్డి, మల్లికార్జున సుబ్బారెడ్డి పాల్గొన్నారు. బోగోలులో బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ యాదవ్, ఎం.శ్రీనివాసులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

317 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మార్చి 15: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 332 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 317 బేళ్లు కొనుగోలు చేశారు. సీఆర్-4, జంపింగ్ లాట్స్-11 వంటి కారణాలతో 15బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.230, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.230గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి : ఎంపీ బీద

అల్లూరు, మార్చి 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలతో రాష్ట్రాభివృద్ధి జరిగిందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో జగనన్న ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ నేరుగా లబ్ధి చేకూరే విధంగా జగనన్న పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారన్నారు. అనంతరం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, కావలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, నీలం సాయికుమార్, బీద రమేష్, మేడా శ్రీనివాసులు రెడ్డి, సూరిశెట్టి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బోగోలు ఎస్ఐగా బొజ్జ



బిట్రగుంట, మార్చి 15: బోగోలు మండలం తిప్ప పోలీస్ స్టేషన్ ఎస్సైగా కే.బొజ్జ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శేఖర్ బాబు సీఐగా పదోన్నతిపై బదిలీ కావడంతో నెల్లూరు రూరల్ స్టేషన్‌లో పనిచేస్తున్న కే.బొజ్జ ఇక్కడకు బదిలీ చేశారు. రాన్నున సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా జరిగేందుకు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

వలంటీర్లు రాజకీయాలు చేస్తే జైలుకే..

కావలి, మార్చి 15: గ్రామాల్లో, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో వలంటీర్లు రాజకీయాలు చేస్తున్నారని, వారిపె ఫిర్యాదు చేస్తే జైలుకుపోక తప్పదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వలంటీరుల జోక్యం ఉండకూడదన్న ఆదేశాలను తుంగలో తొక్కి అధికారపార్టీ ఇచ్చిన తాయిలాలను ప్రజలకు అందించి మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వైసీపీకి ఓట్లు వేయకపోతే ఇబ్బందిపడుతారని సంక్షేమ పథకాలు రావని బెదిరిస్తున్నారన్నారు. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ప్రజలకు ఇలాంటి బెదిరింపులు చేస్తున్నారన్నారు. ప్రజాసేవకన్నా అధికారపార్టీ సేవకే వలంటీర్లు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి కేసులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో నేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి లక్ష్మయ్య, ముక్కు మోహన్‌రావు, కంకణాల ఏడుకొండలు, జడ్డా వాసు, జనార్దన్‌రావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, మార్చి 15: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు జగనన్న చేయూత 4వ విడత చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండలంలోని 7,476 మంది లబ్ధిదారులకు రూ.14.01 కోట్లు జమ చేశారన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, ఎమ్పీడీవో కార్యాలయ ఏవో శ్రీధర్, మున్సిపల్ ఇన్‌చార్జి డీఈ సాయిరాం, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు జీ.తెరీసా, వైసీపీ నేతలు గ్రంధం ప్రసన్నాంజనేయులు, నాగన్నగారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మజ్జిగ చలివేంద్రాలు

బిట్రగుంట, మార్చి 15: బోగోలు మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు బెంగళూరుకు చెందిన పారిశ్రామిక వేత్త సంజయ్ రవి కొండ దాతృత్వంతో వేసవిలో మజ్జిగ అందజేసేందుకు మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభించారు. శుక్రవారం కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాలలో మజ్జిగ చలివేంద్రాన్ని ఎంఈవోలు నరసింహారావు, జయమలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు సరస్వతి నమస్తుభ్యం వ్యవస్థాపకుడు, ప్రధానోపాధ్యాయుడు మద్దులూరి ప్రసాద్‌రావు దాతల సహకారంతో పాతబిట్రగుంట, కడనూతల, కొండబిట్రగుంట లలో ఏర్పాటు చేయించిన చలివేంద్రాలు వేసవి సెలవులు ఇచ్చేంత వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం కనకారావు, ఉపాధ్యాయులు శ్రీఆచారి, డీ.విజిత, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం

అల్లూరు, మార్చి 15 : మన ఓటు మనమే వేసుకుందాం అనే నినాదంగా కావలి అసెంబ్లీ స్థానం నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. అల్లూరులో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బహుజన వర్గానికి చెందిన పసుపులేటి సుధాకర్‌ను స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిపించేందుకు పనిచేయాలని అనుకున్నామని, కానీ తమ వర్గం నాయకులు మా ఓటు మనమే వేసుకుందామని కోరడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఎటువంటి విభేదాలు లేకుండా పసుపులేటి సుధాకర్ అనుచరుడిగా ఉన్న తాను స్వచ్ఛందంగా వైదొలిగానన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు ప్రసన్న గణపతి, కోవూరు బాబు, కావూరి బంగారయ్య, గాలి వేణుగోపాల్, నక్కా గిరి, కప్పల నవీన్‌కుమార్, ఎల్లు సుబ్రహ్మణ్యం, దానం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమరా విజయలక్ష్మి

కావలిటౌన్, మార్చి 15: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమ ఇతులైన అమరా విజయలక్ష్మి శుక్రవారం కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాజీ మంత్రి వేలంపల్లి శ్రీనివాస్‌ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో అమరా వేదగిరి, ఆయన సతీమణి విజయలక్ష్మి దంపతులకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు మామిడి రామకృష్ణ, డాక్టర్ శ్రీరాం మనోహర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి నారాయణ, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి తదితర ఆర్యవైశ్య ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.


విజయలక్ష్మి,వేదగిరి దంపతులను సన్మానిస్తున్న నేతలు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎంతో కీలకం



మనుబోలు: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మనుబోలు, మార్చి 15: ఎన్నికలను స్వేచ్ఛగా, నిజాయితీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎంతో కీలకమని తహసీల్దార్ కే చిరంజీవి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి ప్రవర్తనా నియమావళిపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు. పార్టీ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫ్లెక్సీలు, ఫోటోలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీఎస్‌పీ ప్రసాద్, వీఆర్‌వోలు నాగార్జున్‌రెడ్డి, మురళీధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.




కోవూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సాయుధ దళాలు

కోవూరులో సాయుధ దళాల కవాతు

కోవూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండల పరిధిలోని పలుచోట్ల సాయుధ దళాలు ప్రదర్శన చేశాయి. కోవూరు, లేగుంటపాడు, ఇనమడుగు, వేగూరు, గుమ్మళ్ళదిబ్బ గ్రామాల్లో సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంగనాధగౌడ్ ఆధ్వర్యంలో సాయుధదళాలతోపాటు స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు.

అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడు



ఆకుపై అమరజీవి సూక్ష్మచిత్రం

ముత్తుకూరు, మార్చి 15 : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు సూక్ష్మచిత్రాన్ని క్రోటన్ ఆకుపై కార్వింగ్‌తో రూపొందించి నివాళులు అర్పించారు ముత్తుకూరుకు చెందిన సూక్ష్మ చిత్రకారుడు సోమా పద్మారత్నం. మహాత్మాగాంధీ ఆశయాల సాధన కోసం కృషి చేసిన మహా నీయుడన్నారు.

ఈ క్రాప్ నమోదుపై అవగాహన



ధ్రువీకరణ పత్రాలను అందజేసిన జిల్లా వ్యవసాయ అధికారి సత్యవతి

ముత్తుకూరు, మార్చి 15: రైతులకు ఈక్రాప్ నమోదు ప్రాముఖ్యతపై జిల్లా వ్యవసాయ అధికారి సత్యవతి అవగాహన కల్పించారు. శుక్రవారం బ్రహ్మదేవం సచివాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాలంటే ఈక్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. వరిసాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. అనంతరం రైతులకు పంట ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి జోత్స్నరాణి, వ్యవసాయ సహాయకులు ప్రసన్నకుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్య తీసుకోవాలి : సీపీఎం

తోటపల్లిగూడూరు, మార్చి 15: వైసీపీ నాయకులకు కోవర్టుగా పనిచేస్తున్న ఎస్‌ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని నరుకూరు సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య మాట్లాడుతూ నరుకూరులో ఉంటున్న మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు రమణమ్మ మనవడు పచ్చ రాజేష్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొందరు పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని దాడిచేశారని, దీంతో న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కి వెళ్లగా దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఏపీ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా పచ్చా మధు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 15: కాంగ్రెస్‌పార్టీ ఏపీ స్టేట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా పచ్చా మధును నియమించినట్టు ఆశాఖ రాష్ట్ర అధ్యక్షుడు సాకే శంకర్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ జాతీయ అధ్యక్షుడు కొప్పుల రాజు ఐఏఎస్ ప్రకటించారు. ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు నియమించినట్టు తెలిపారు. ఈమేరకు పార్టీ అభివృద్ధికి తోడ్పడతానని పచ్చా తెలిపారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బిట్టా కొనసాగింపు

బుచ్చిరెడ్డిపాళెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బిట్టా శ్రీనివాసులు(కిషోర్)నే కొనసాగిస్తూ నియామకపత్రం అందజేసిన అఖిల భారత కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డికి శుక్రవారం ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మళ్ళీ అధ్యక్ష పదవిలో కొనసాగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా కామాక్షితాయి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి15: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామికి ఆలయ పురోహితులు శ్రీధర్‌శర్మ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో అమ్మవారి ఉత్సవమూర్తికి సామూహిక కుంకుమార్చన, పల్లకీ సేవలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో కల్యాణోత్సవం, పల్లకిసేవలో పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కామాక్షితాయిని దర్శించుకుంటున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

మండలంలోని జొన్నవాడ ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెను అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారివెంట స్థానిక మాజీ ఇరిగేషన్ ఏఈ ప్రసాద్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు దంపతులున్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

మండలంలోని జొన్నవాడలో కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వార్లను దర్శించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి గీతమ్మ, కోడలు కామాక్షితాయిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో వారిని స్వాగతించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు, శేషవస్త్రాలు అందజేశారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

కొడవలూరు : నియోజకవర్గ అభివృద్ధి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంతిరెడ్డి గెలుపు తథ్యమన్నారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు ఎంపీటీసీ గరికపాటి రాజేంద్రకుమార్, మందిపాటి రమణారెడ్డి, కరుటూరి మురళీ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు నుంచే బరిలో ఉంటా : దినేష్

కొడవలూరు మార్చి 15: అసెంబ్లీ ఎన్నికలలో తాను కోవూరు నుంచే బరిలో ఉంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నార్తురాజుపాళెంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి దినేష్ పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ అభ్యర్థిత్వంపై చంద్రబాబు పునరాలోచించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, విరేంద్ర చౌదరి, శేషయ్య, మల్లారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

మనుబోలు, మార్చి 15: పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్‌ఐ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఈనేపథ్యంలో ఆయన శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల హైస్కూల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. బయట వ్యక్తులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించమన్నారు. జెరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని ఎస్‌ఐ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం వెంకన్నపాళెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ స్వర్ణకుమారి తన మనవడు చింటూ జ్ఞాపకార్థం వీఆర్‌ఏ రమేష్ ఆధ్వర్యంలో మనుబోలు బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఎస్‌ఐ చేతుల మీదుగా పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి, హసీనా, ఉషారాణి, కృష్ణజ్యోతి, ప్రియాంక, ఉషా కుమారి పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

మనుబోలు, మార్చి 15 : పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని కోదండ రామాపురం, మడమనూరు బీసీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ఆకు కూరలు, కోడిగుడ్లు, పాలు తీసు కోవాలన్నారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు రవణమ్మ, పద్మజ, ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు జీ సుగుణమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని కలిసిన నాయకులు, కార్యకర్తలు

తోటపల్లిగూడూరు, మార్చి 15: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన రెండో జాబితాలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరు లేకపోవడంతో తోటపల్లిగూడూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేదాయపాలెంలో ఉన్న సోమిరెడ్డి నివాసం లో కలిశారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన సోమిరెడ్డి పేరు రెండో జాబితాలో కూడా లేకపోవడంతో చాలా బాధపడుతున్నామని తెలిపారు. అధిష్ఠానం ఆలోచించి మూడో జాబితాలో సోమిరెడ్డికి స్థానం కల్పించాలని కోరారు.

పల్లెపాడు డైట్‌కు కుర్చీల వితరణ

ఇందుకూరుపేట, మార్చి 15: పల్లెపాడు జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో 1992 -93 విద్యా సంవత్సరంలో శిక్షణ పొంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు కొండూరు సుబ్బారావు, ఎన్ మల్లికార్జునరావు, వి పద్మయ్య, వి మల్లికార్జునయ్య కుర్చీలు, ఆటవస్తువులు సంస్థకు శుక్రవారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

పొదలకూరు, మార్చి 15: శ్రీ కరుణామయి చారిటబుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 400 మంది రోగులను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. 80 మంది విద్యార్థులకు దంత వైద్య నిపుణులు పరీక్షించి ఉచితంగా బ్రష్‌లు, పేస్ట్‌లు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ విజయభారత్, తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ జట్టి పనుల పరిశీలన

ముత్తుకూరు, మార్చి 15: నేలటూరు వద్ద నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ జట్టి పనులను వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లా డుతూ అదాని కృష్ణపట్నం పోర్టు సీఎస్‌ఆర్ నిధుల నుంచి రూ. 25కోట్ల ఖర్చుతో ఫిషింగ్ జట్టి పనులు జరుగుతున్నాయని, పనులను పూర్తిచేస్తున్న పోర్టు సీఈవో జీజేరావు, వేణుగోపాల్‌కు మత్స్యకారుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, పోర్టు కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, నాయకులు ఈపూరు కోటారెడ్డి, చిన్నపరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శివప్రసాద్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, మార్చి 15: మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. క్రిష్ణప్రసాద్ అనే వ్యక్తి సర్వేపల్లి నుంచి నెల్లూరు వైపు మోటార్‌బైక్‌పై వెళ్తుండగా తిక్కవరప్పాడు క్రాస్ రోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ బోల్తాపడింది. ఈప్రమాదంలో క్రిష్ణప్రసాద్‌కు గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

ఇందుకూరుపేట, మార్చి 15: మండలంలోని గంగపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం 10గంటలకు నెల్లూరుజిల్లా చిరంజీవి యువత సహకారంతో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌తేజ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ నెల్లూరుజిల్లా అధ్యక్షుడు గుడి హరికుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

అటు పరిచయం.. ఇటు ఆత్మీయం

- నెల్లూరులో జోరుగా ప్రచార కార్యక్రమాలు
- పాల్గొన్న వేమిరెడ్డి, నారాయణ, సోమిరెడ్డి



సిటీ నియోజకవర్గ ఆత్మీయ సదస్సులో ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి, నారాయణ, కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో టీడీపీ ప్రచార కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పరిచయ కార్యక్రమాలు, ఆత్మీయ సదస్సులు జోరుగా జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన పలు కార్యక్రమాల్లో వేమిరెడ్డితోపాటు మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజానాయుడు నివాసంలో రూరల్ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య నేతలు, కార్యకర్తలను వేమిరెడ్డి పరిచయం చేసుకున్నారు. నారాయణ, సోమిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి భారీ మెజారిటీ సాధించాలని అందరూ తీర్మానించుకున్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ కార్యాలయంలో వేమిరెడ్డి పరిచయ కార్యక్రమం జరిగింది. నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. మాగుంట లేఅవుట్‌లోని అనిల్‌గార్డెన్స్‌లో సిటీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. వేమిరెడ్డి, నారాయణ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు.

● టీడీపీ, బీజేపీ ముఖ్యనేతలంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ఆహ్వానం మేరకు వేమిరెడ్డి, నారాయణ, శ్రీధర్‌రెడ్డి నగరంలోని బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. వారిని బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేశారు. పీ సురేంద్రరెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రూప్‌కుమార్, తాళ్లపాక అనురాధ, భరత్‌కుమార్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10కి 10 ఎమ్మెల్యే స్థానాలు కూటమివే!

● టీడీపీ రూరల్ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 15 : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 ఎమ్మెల్యే స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించబోతోందని తెలుగు దేశం పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జోస్యం చెప్పారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నేతలు ఆయన సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కనీవినీ ఎరుగని మెజార్టీతో విజయం సాధించబోతున్నారన్నారు. 18వ డివిజన్ సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతానికి చెందిన మాచర్ల రమణయ్య మిత్రబృందం పార్టీలో చేరింది. 33వ డివిజన్ వెంగళరావు నగర్‌కు చెందిన పెళ్లకూరు సుబ్బరాయుడు, షేక్ రమీజ్, నక్కా శ్రీనివాసులు, రవికుమార్, క్రాంతికుమార్, పద్మశాంతి మిత్రబృందం పార్టీలో చేరింది. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, వనజారెడ్డి, పెనాక శ్రీనివాసులురెడ్డి, పవన్‌రెడ్డి, లక్ష్మయ్య, కొల్లి పవన్‌కుమార్‌రెడ్డి, మీరా, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ, వేమిరెడ్డితోనే స్మార్ట్‌సిటీ సాధ్యం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి



ప్రచారం చేస్తున్న కోటంరెడ్డి, తదితరులు

నెల్లూరు (వైద్యం), మార్చి 15 : నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చాలంటే అది మాజీ మంత్రి నారాయణ, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వల్లే సాధ్య మని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వెల్లడిం చారు. శుక్రవారం 16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అధికారం ఇస్తే అభివృద్ధి, సంక్షేమ అంటే ఏమిటో చూపిస్తామన్నారు. టీడీపీ హయాంలో నెల్లూరు నగరంలో 90 శాతం అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని పక్కన పెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెనుబర్తి సాయిరాం, మురళి, కేవీ రెడ్డి, హనీఫ్, కృష్ణ, గురు, ఆనంద్, క్రాంతి, రాజేంద్ర, మంజుల తదితరులు పాల్గొన్నారు. కాగా, పొంగూరు నారాయణను నెల్లూరు సిటీలో భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతీమణి రమాదేవి ఓటర్లను కోరారు. శుక్రవారం నగరంలోని 15వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం చేపట్టి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

ప్రశాంతిరెడ్డికి మద్దతు



ప్రశాంతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట/ హరనాథపురం), మార్చి 15: కోవూరు నియోజకవర్గంలో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గెలుపే ధ్యేయంగా ప్రతి జన సైనికుడు పని చేయాలని జిల్లా పవన్ కల్యాణ్ యువత అధ్యక్షుడు గుడి హరికుమార్ రెడ్డి, పార్టీ కోవూరు నియోజక వర్గం పీవోసీ చప్పిడి శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో శుక్రవారం కోవూరు నియోజకవర్గం జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రశాంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపా రు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఐటీ కోఆర్డినేటర్ నక్కల శివకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ముల్లా మున్వర్ బాషా, మాధవ్, సలాంబాయి, శ్రీనాథ్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో వీపీఆర్ నివాసానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకుని ప్రశాంతిరెడ్డికి అభినంద నలు తెలిపారు. ఆమెను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు.

గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలి

- టీడీపీ వైద్య విభాగం జిల్లా ప్రతినిధి డాక్టర్ సిరాజ్
- తిరుమలకు వెళుతున్న వారికి నగరంలో బస



నెల్లూరు చేరుకున్న పాదయాత్రికులతో డాక్టర్ సిరాజ్

నెల్లూరు (వైద్యం), మార్చి 15 : గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, టీడీపీ వైద్య విభాగం జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ సిరాజ్ డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యులను గుర్తించాలంటూ అనకాపల్లి జిల్లా రావికమతం మండలం దొంతపూడి గ్రామం నుంచి బేసిక్ హెల్త్‌కేర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యుడైన సాలాపు శ్రీనివాసులు మిత్రబృందం కాలినడకన తిరుమలకు యాత్ర చేపట్టింది. ఆ యాత్ర శుక్రవారం నెల్లూరు చేరింది. వారికి డాక్టర్ సిరాజ్ నగరంలోని అయ్యప్పగుడి వద్ద బస ఏర్పాటు చేశారు. గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపు ఇస్తామని గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల అనంతరం ఏర్పడబోయే ప్రభుత్వమైనా తమను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎల్ నారాయణరావు, డెవలప్ కమిటీ కన్వీనర్ ఎస్దాని, ధనలక్ష్మి, వెంకటరమణ, రాజేష్, భాను, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా స్టంట్ మాస్టర్స్ సంఘం ఏర్పాటు



కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న స్టంట్‌మాస్టర్స్

నెల్లూరు (విద్య): సినిమా స్టంట్ మాస్టర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. నగరంలోని టౌను హాలులో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి 25 కళాసంఘాల కన్వీనర్ అమరావతి కృష్ణారెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఇటీవల నెల్లూరులో సినిమా షూటింగ్‌లు జోరందుకున్నాయని, ఈ నేపథ్యంలో స్టంట్ మాస్టర్స్ అసోసియేషన్ ఏర్పాటు అభినందనీయ మన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడిగా వేగూరు ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా ఎంవీ సుకన్య, సుధావాణి, కే వంశీకృష్ణ, కార్యదర్శిగా జీ శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా ఏ మురళీకృష్ణ, కోశాధికారిగా వేగూరు వెంకట కృష్ణయ్య ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళా సంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, కోసూరు రత్నం, హరినాథరెడ్డి, భాస్కర్, అమీర్‌జాన్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి అందుకుంటున్న విద్యార్థులు

నెల్లూరు (విద్య), మార్చి 15 : నగరంలోని సుంకు చెంగన్న నగరపాలక ఉన్నత పాఠశాల లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు పరీక్ష సామగ్రి, సర్టిఫికెట్ ఫోల్డర్ ఫైల్స్ అందచేశామన్నారు. సంఘం సభ్యుడు డాక్టర్ ఎంఎస్‌రెడ్డి సహకారంతో ఈ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్, వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కే అరవింద్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

నెల్లూరు (విద్య), మార్చి 15 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమానికి శుక్రవారం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాల చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిత్యావసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం చంద్రమోహన్‌రెడ్డి, మెకానికల్ విభాగం హెడ్ నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేదగిరిపై విఖనస మహర్షి విగ్రహ ప్రతిష్ఠకు పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లూరు రూరల్, మార్చి 15 : ఆగమశాస్త్ర సూత్రకర్త విఖనస మహర్షి శిలా ప్రతిమను వేదగిరి క్షేత్రంలో ప్రతిష్ఠించేందుకు సంబంధించి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. భగవత్ ప్రార్థన, రక్షా బంధనం, పుణ్యాహవచనం, విష్వక్సేన పూజ నిర్వహించారు. ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ : ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ): రంజాన్ మాసం నేపథ్యంలో నగరంలోని మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంహెచ్‌వో వెంకట రమణయ్య తెలిపారు. శుక్రవారం పలు మసీదుల వద్ద పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. మసీదులున్న ప్రాంతాల్లో నిత్యం ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలు తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.


సౌత్‌మోపూరులో అభివృద్ధి కార్యక్రమాలు

నెల్లూరు రూరల్, మార్చి 15 : మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయ కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటికి ఏకాంతసేవ

● ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 15 : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి ఏకాంతసేవ కనుల పండువగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషే కాలు, విశేష పూజలు జరిగాయి. రాత్రి విశేష పూలంగి సేవ జరిగింది. భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామికి ఏకాంతసేవ పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు, ఈవో వేణుగోపాల్ పర్యవేక్షించారు. ఏకాంత సేవతో స్వామి వారి శివరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి.





కపిలతీర్థం ఆలయం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న ఆరణి శ్రీనివాసులు

'ఆరణి'తో అడ్జస్టవ్వాలా? వద్దా?

- కూటమి నాయకుల మల్లగుల్లాలు
- ఫోన్ మంతనాల్లో జనసేన అభ్యర్థి

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపికైన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో సర్దుకు పోవాలా, లేదా అన్న మీమాంసలో కూటమి నేతలు ఉన్నారు.స్థానికులను కాదని చిత్తూరుకు చెందిన వ్యక్తిని తిరుపతి అభ్యర్థిగా తీసుకు రావడం టీడీపీ-జనసేన నాయకుల్లో అసమ్మతి కుంపటి రాజేసిన విషయం తెలిసిందే.అభ్యర్థికి సహకరించకపోతే తీవ్రమైన చర్యలు తీసుకుంటామంటూ ఇరు పార్టీల అధిష్ఠానాల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో అసమ్మతి నేతలు కాస్త చల్లబడ్డట్టు తెలుస్తోంది. అయితే వైసీపీ అభ్యర్థిని ఓడించడమే ధ్యేయంగా పనిచేయాలంటే స్థానికత చాలా కీలకమన్న భావనలో ఉన్న బలిజ సామాజికవర్గానికి చెందిన ముగ్గురు నేతలు ఇప్పటికీ ఆరణితో మాట్లాడేందుకు అంగీకరించడంలేదు.ఈ క్రమంలో శుక్రవారం ఆరణి శ్రీనివాసులు తిరుపతికి వచ్చారు. అయితే టీడీపీ నుంచి కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేన నుంచి పసుపులేటి హరిప్రసాద్ మాత్రమే ఆయన వెంట కనిపించారు. అక్కడినుంచి హోటల్‌కు చేరుకుని అసమ్మతి నాయకులతో ఫోన్లో మాట్లాడే ప్రయత్నం చేశారు.టీడీపీ నేతలు నరసింహ యాదవ్, బుల్లెట్ రమణ తదితరుల ఇళ్లకు వెళ్లినట్టు సమాచారం. మూడు పార్టీలు కలిసే తనను ఎంపిక చేశారని చెప్పుకొచ్చిన శ్రీనివాసులు ఇంతకాలం కష్టపడిన నాయకుల్లో అసంతృప్తి వుండడం సహజమేనని, అయితే త్వరలోనే అన్నీ సర్దుకుంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జనసేన అభ్యర్థి శ్రీనివాసులుకు వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి ఎదురుపడ్డారు.అభివాదం చేసుకుని బాగున్నారా అంటూ కరచాలనం చేసుకున్నారు.యాధృచ్ఛికంగా జరిగిన వీరి కలయిక వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆరణి వైసీపీ నాయకుడే కాబట్టి వచ్చీరాగానే ఆ పార్టీ అభ్యర్థితో మాటలు కలిపారన్న చర్చ నడిచింది.



మీడియా సమావేశంలో నగరి నేతల ప్లకార్డుల ప్రదర్శన

వెంకటగిరి, నగరిల్లో వైసీపీ వర్గపోరు

నేదురుమల్లి, రోజాలకు టికెట్లిస్తే పనిచేయమంటున్న జగన్ తమ్ముళ్లు

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, నగరి నియోజకవర్గాల అధికార పార్టీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. శనివారం ఈసీ ఎన్నికల షెడ్యూలును, వైసీపీ అధిష్ఠానం అభ్యర్థుల జాబితానూ విడుదల చేయనున్న నేపథ్యంలో ముందు రోజు జరిగిన పరిణామాలు పార్టీ వర్గాలను కలవరపాటుకు గురి చేశాయి. అసమ్మతి నేతల బలాన్ని పక్కన పెడితే ఎన్నికల ప్రారంభంలో ఇలాంటి ప్రచారం పార్టీ విజయావకాశాలను గణనీయంగా దెబ్బతీస్తుందని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.వెంకటగిరి వైసీపీలో ఇటీవల సద్దుమణిగి నట్టు కనిపించిన అసమ్మతి శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైసీపీకి దూరం కాగా ఆయన స్థానంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ ఇంఛార్జిగా నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను దక్కించుకోవడంతో జిల్లాలో నేదురుమల్లికి సీఎం జగన్ ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదీ తేటతెల్లమైంది.దీంతో నియోజకవర్గంలో బలపడాల్సిన రామ్‌కుమార్‌రెడ్డి దానికి భిన్నంగా సొంత పార్టీలోనే బలహీనపడ్డారు. ఆనం రామనారాయణరెడ్డి సన్నిహితులనే అనుమానంతో పలువురు పార్టీ నేతలను దూరం పెట్టారు. అందరినీ కలుపుకుపోవడంలో విఫలమయ్యారు. ప్రారంభంలో అసమ్మతి వర్గం ఆయనకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించినా రామ్‌కుమార్‌రెడ్డి తల్లి రాజ్యలక్ష్మి వారితో మాట్లాడి బుజ్జగించడంతో కొంతమేరకు సద్దుమణిగింది.దీంతో ఎన్నికలు సమీపించినందున అంతా సర్దుకుపోయి నట్టేనని అధిష్ఠానం భావించింది. అలాంటిది శుక్రవారం హఠాత్తుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచీ ప్రజాబలం కలిగిన పలువురు నేతలు తమ అనుచర వర్గంతో రేణిగుంటలోని విమానాశ్రయం వద్దకు వెళ్ళి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇంఛార్జిగా నియమితులైన నాటి నుంచీ పార్టీలో అందరినీ కలుపుకుని వెళ్ళడం లేదని ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆయనకు టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు.రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఆయన గెలుపు కోసం తాము పనిచేసేది లేదని కుండ బద్దలు కొట్టారు. కాదని ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా ఆయన ఓటమి ఖాయమని తేల్చి చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచీ కీలక నేతలు, వారి అనుచరులు మూకుమ్మడిగా రావడంతో పాటు రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే పని చేసేది లేదంటూ నిర్మొహమాటంగా చెప్పడంతో మంత్రి పెద్దిరెడ్డి ఖంగు తిన్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి 24 గంటల సమయం కూడా లేని తరుణంలో వెంకటగిరిలో తలెత్తిన అసమ్మతి తీవ్రతను గుర్తించిన ఆయన తనకు ఒక రోజు సమయం ఇస్తే ఆలోపు అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని సర్దిచెప్పారు. ఒక రకంగా చెప్పాలంటే వెంకటగిరి వైసీపీ అసమ్మతి వర్గం బలప్రదర్శనకు శుక్రవారం విమానాశ్రయ ఆవరణ వేదికైంది. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో అసమ్మతి వర్గం మంత్రిని కలవగా ఆ బృందంలో వెంకటగిరి వైసీపీ టికెట్ రేసులో వున్న డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి సైతం వున్నారు. మంత్రిని కలసిన వారిలో వెంకటగిరి ఎంపీపీ తనూజ భర్త శివారెడ్డి, రాపూరు ఎంపీపీ ప్రసన్న, చెన్ను తిరుపాల్‌రెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ వెందోడి భాస్కర్‌రెడ్డి, కలువాయి మండల నేత రాఘవరెడ్డి, సైదాపురం జడ్పీటీసీ, ఎంపీపీలు, ఆ మండల నేత నోటి రమణారెడ్డి, దక్కిలి వైస్ ఎంపీపీ గడ్డం సుధీర్‌రెడ్డి, ఆ మండల నేత మాధవరెడ్డిలతో పాటు వెంకటగిరి, రాపూరు మండలాలకు చెందిన 20మంది సర్పంచులు, వారి వర్గీయులు వున్నారు. ఎన్నికల షెడ్యూలుకు ముందురోజు సంభవించిన ఈ పరిణామం వెంకటగిరి నియోజకవర్గ అధికార పార్టీలో కలకలం సృష్టించింది.

అసమ్మతివర్గంలో రోజాపై వీడని వ్యతిరేకత

నగరి విషయానికొస్తే మంత్రి రోజాకు అసమ్మతి బెడద తగ్గడం లేదు సరికదా అంతకంతకూ పెరుగుతోంది. ఎంతోకాలంగా రోజాను వైసీపీలో పలువురు నేతలు వ్యతిరేకిస్తూ వస్తున్నా అధిష్ఠానం పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎన్నికలు సమీపించేసినందున ఇక అసమ్మతి వర్గం సర్దుకుపోతుందని భావిస్తున్న తరుణంలో ఆ అంచనాలు తారుమారయ్యాయి. శుక్రవారం నియోజకవర్గానికి చెందిన పలువురు మండల స్థాయి నేతలు తిరుపతిలో మీడియా సమావేశం పెట్టి మరోసారి తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.రోజాకు టికెట్ ఇవ్వకూడదని అధిష్ఠానాన్ని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి కోరారు. తమ మాట కాదని టికెట్ ఇస్తే ఆమెను ఓడిస్తామని హెచ్చరించారు.ఈ విషయంలో అధిష్ఠానం మాట కూడా వినే పరిస్థితిలో లేమని అన్నారు. రోజా అక్రమాలు, వేధింపులపై పార్టీ నేతలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. అసంతృప్త నేతలతో అధిష్ఠానం మాట్లాడి ఒప్పించిందని, ఇప్పుడు అంతా సవ్యంగా ఉందనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారు.ఎప్పటికీ ఆమెపై ఉన్న వ్యతిరేకత పోయే పరిస్థితి లేదన్న విషయాన్ని పార్టీ అధిష్ఠానం తెలుసుకొని ఇంకొకరికి సీటు ఇస్తే కష్టపడి గెలిపించుకుంటామన్నారు. అధికారంలోకి రాక ముందు రోజాకు ఉన్న అప్పులు, ఇప్పుడు ఉన్న ఆస్తులను పరిశీలిస్తే ఆమె ఏ స్థాయిలో అక్రమాలకు, అవినీతికి పాల్పడిందో తెలుస్తుందన్నారు.బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీ రవిశేఖర్‌రాజు, వైసీపీ నేతలు తులసీరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునేంద్ర, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నా...సొమ్ములెక్కడ?

- బటన్లు నొక్కుతున్నా ఖాతాల్లో జమకాని నగదు
- ఎదురుచూస్తూనే వున్న రైతులు, మహిళలు



తుఫాన్ ప్రభావంతో ఎన్‌వీ కండ్రిగ సమీపంలో ఇసుక మేటలు, రాళ్లు చేరి దెబ్బతిన్న పంటపొలాలు

గత ఏడాది డిసెంబరులో తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు పెట్టుబడి రాయితీ సాయం విడుదల చేస్తూ సీఎం జగన్ వారం రోజుల కిందట బటన్ నొక్కినా అన్నదాతల ఖాతాల్లో ఇప్పటికీ నగదు జమకాలేదు. ఆసరా లబ్ధికి సంబంధించి సీఎం బటన్ నొక్కి 50 రోజులు పైబడినా నాలుగో విడత ఆసరా సొమ్ము మహిళల బ్యాంకు ఖాతాలకు ఇంకా జమకాలేదు.చేయూత కింద మహిళలకు అందజేసే సొమ్ము పరిస్థితి కూడా ఇదే.రోజూ బ్యాంకుల వద్దకు వెళుతున్న లబ్ధిదారులు ఖాతాలో సొమ్ము జమకాలేదని తెలిసి నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సూళ్లూరుపేట, మార్చి 15: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో అన్ని మండలాలతో పాటు గూడూరు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో దాదాపు 5 వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అప్పట్లో ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు. తుది అంచనాల్లో పంట నష్ట విస్తీర్ణం సగానికి పైగా తగ్గింది. 50 రోజుల్లోపు పంట దెబ్బతిన్నా ఎలాంటి పరిహారం లేకుండా 80 శాతం రాయితీ విత్తనాలు అందజేసి చేతులెత్తేశారు. వాకాడు మండలంలో పంట నష్ట పరిశీలనకు వచ్చిన సీఎం జగన్ అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటామని, పెట్టుబడి రాయితీ సొమ్మును సంక్రాంతి లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని గొప్పగా ప్రకటించారు. కానీ పంట నష్టపరిహారం చెల్లింపులో దాదాపు మూడు నెలల పైబడి జాప్యం జరిగింది. మూడు నియోజకవర్గాల్లో 4,076 మంది రైతులకు చెందిన దాదాపు 2,231 హెక్టార్ల పంట దెబ్బతింది. వీరికి హెక్టారుకు రూ.17 వేల చొప్పున రూ.3,79,18470 పరిహారం అందించేలా అధికారులు నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అదే విధంగా 380 హెక్టార్లలో ఇసుక మేటలు వేసినట్లు గుర్తించి 1195 మంది రైతులకు హెక్టారుకు రూ.18 వేల చొప్పున రూ.68.49 లక్షల మేర పరిహారానికి అంచనా వేశారు. పలు మండలాల్లో పొలాల్లో ఉన్న సారవంతమైన మట్టికొట్టుకుపోయింది. 113 హెక్టార్లలో 369మంది బాధిత రైతులకు హెక్టారుకు రూ.47 వేల చొప్పున రూ.53.24లక్షలు అవసమని నివేదికలు సిద్ధం చేసి పంపి జాబితాలను కూడా ప్రకటించారు. నేటికీ వారి ఖాతాల్లో నగదు జమ కాలేదు.

ఆసరా, చేయూత సొమ్ములు కూడా అంతే..

మహిళా సంఘాలకు నాలుగో విడత ఆసరా లబ్ధికి జనవరి 23న అనంతపురం జిల్లా ఉరవకొండలో సీఎం జగన్ బటన్ నొక్కారు. అదే రోజు లబ్ధిదారులకు ఎక్కడికక్కడ స్థానికంగా నమూనా చెక్కులు అందజేశారు. ఆ చెక్కులు అందిన మరుసటి రోజు నుంచే మహిళల బ్యాంకు ఖాతాలకు నగదు జమవుతుందని అధికారులు చెప్పారు. 50 రోజులు దాటినా ఇప్పటికీ చాలామంది ఖాతాలకు నగదు జమకాలేదు. సూళ్లూరుపేటలోనే 827 పొదుపు సంఘాలుండగా 500సంఘాలకు మాత్రమే సొమ్ము జమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారీగా ఖాతాలకు వేయడం వల్ల ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. 45 సంవత్సరాలు నిండిన మహిళలకు వైఎస్సార్ చేయూత కింద రూ.18,500 అందజేసేందుకు సీఎం బటన్ నొక్కి ఆయా మండలాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఆర్భాటంగా ఎన్నికల ప్రచార సభల్లా నిర్వహించి చెక్కులు పంపిణీ చేశారు.సూళ్లూరుపేటలోనే 2435మంది లబ్ధిదారులున్నారు. ఏ ఒక్కరికీ ఇప్పటిదాకా ఖాతాల్లో నగదు జమకాలేదు.

రైతు భరోసా సొమ్ము కూడా..

ఎన్నికల షెడ్యూల్ దగ్గర పడుతుండగా ఈ నెల 6న రైతుల ఖాతాల్లో పెట్టుబడి రాయితీ సొమ్మును జమచేస్తూ సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కారు. వారందాటినా అధికశాతం రైతుల ఖాతాల్లో రాయితీ సొమ్ము జమ కాలేదు. బ్యాంకుకు వెళ్లిన అన్నదాతలు ఇంకా సొమ్ము జమకాలేదని తెలిసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. సున్నా వడ్డీ రాయితీ సొమ్ము సైతం విడుదల చేసినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. లబ్ధిదారుల జాబితాను ఆర్‌బీకేల్లో ప్రదర్శించారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఇంకా రాయితీ సొమ్ము జమకాలేదు. కౌలు రైతులకు సైతం రూ.2 వేల సాయం అందిస్తామన్నారు. ఆ సాయం కూడా ఇంకా అందలేదు. వారు కూడా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.





ఏకాంత సేవకు ఆదిదంపతులు

- ముగిసిన ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, మార్చి 15: ముక్కంటి ఆలయ శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి ఏకాంత సేవను వేడుకగా నిర్వహించారు.ఆలయం మూసే వేళ స్వామివారి సన్నిధిలో చిన్న వెండి పల్లకిని ముస్తాబు చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల శివనామస్మరణ మధ్య స్వామి సన్నిధి నుంచి అమ్మవారికి పిలుపునిస్తూ జ్ఞానాంబిక సన్నిధికి తీసుకెళ్లగా అక్కడ అమ్మవారి ఉత్సవమూర్తి పల్లకిలో ఆశీనులయ్యారు. అక్కడినుంచి గురుదక్షిణామూర్తి సన్నిధి నుంచి ప్రదక్షిణపూర్వకంగా పల్లకి స్వామి సన్నిధిలో ఎదురుగా ధ్వజస్తంభం వద్దకు చేరుకుంది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న శివయ్య ఉత్సవమూర్తి పల్లకిలో దేవేరికి ఎదురుగా ఆశీనులయ్యారు. ఆదిదంపతులు అధిరోహించిన పల్లకిని అమ్మవారి గర్భాలయంలోని శయన మందిరం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అమర్చిన పడక ఊయలలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, భక్తులు వెలుపలకు వచ్చి తలుపులు మూయడంతో ఏకాంతసేవ ముగిసింది.ఉత్సమూర్తులకు డ్రైఫూట్స్ మాలలను, ప్రత్యేక సుగంధభరితమైన పూలమాలలను, పండ్లను భక్తులు సమర్పించారు. అర్చకులు పంపిణీ చేసిన ఏకాంత సేవ ప్రసాదాన్ని స్వీకరించారు.కాగా ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని శుక్రవారం ఉదయం వేద పారాయణ సభ జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాల నుంచి వచ్చిన 100మంది వేద పండితులు గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదాలను పఠించారు.

కాలువలు, చెరువులు కబ్జా కాకుండా చూడండి

వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15: కాలువలు, చెరువులు కబ్జాకు గురికాకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాలువలు, చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని ఆపగలిగితే పంటలను బాగా పండించవచ్చని తెలిపారు.చిట్టమూరు, వాకాడు, కోట, గూడూరు పరిధిలోని రైతులకు సాగునీటి సమస్య రాకుండా తెలుగుగంగ ద్వారా అందించే ఏర్పాట్లు చేశామని తెలిపారు.వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ రబీలో 73,534 మంది రైతులకు 2,02,909 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. మిచౌంగ్ తుపానుతో పంట నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిపారు.జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారి గీతారాణి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి సతీష్, వ్యవసాయ సలహామండలి సభ్యులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : సా. 6.32

సహరి (ఆదివారం) : ఉ. 5.01





ఆయుధాలతో ఆలయం వద్ద ఎన్‌ఎస్‌జీ సిబ్బంది

ఉగ్రవాదులు దాడిచేస్తే....!

- శ్రీవారి ఆలయం వద్ద అర్ధరాత్రి ఎన్‌ఎస్‌జీ, ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుమల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం వద్ద నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, ఆక్టోపస్ బృందాలు మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రవాదులు చొరబడినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, భక్తులను ఎలా రక్షించాలి అనే అంశంపై గురువారం రాత్రి 12.30 గంటల తర్వాత ఆక్టోపస్ ఎస్పీ నాగేంద్రబాబు పర్యవేక్షణలో ఏఎస్పీ నగేష్‌బాబు ఆధ్వర్యంలో దాదాపు 140 మంది ఎన్‌ఎస్‌జీ సిబ్బంది, 40 మంది ఆక్టోపస్ సిబ్బంది ఆలయం వద్దకు చేరుకున్నారు. ఉగ్రవాదులు ఆలయంలోకి ప్రవేశించి తలుపులు మూసివేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశంపై డ్రిల్‌ను మొదలు పెట్టారు. ఏకాంత సేవ పూర్తిచేయగానే డ్రిల్‌ను ప్రారంభించారు. లైట్లను ఆపివేసి లిఫ్టర్ ద్వారా కొంతమంది, మహద్వారం నుంచి మరికొంతమంది భద్రతా సిబ్బంది ఆలయంలోకి ప్రవేశించారు. 30 నిమిషాల్లో డ్రిల్‌ను పూర్తిచేశారు. కాగా, ఆయుధాలతో అంత సంఖ్యలో భద్రతా సిబ్బందిని చూసిన సమీపంలోని భక్తులు ఏం జరుగుతోందో తెలియక కొంతసేపు ఆందోళనకు గురయ్యారు.

ఉరేసుకొని టీమాస్టర్ ఆత్మహత్య



సత్యనారాయణ మృతదేహం

సూళ్లూరుపేట, మార్చి 15: ఉరేసుకొని టీ మాస్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సూళ్లూరుపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళం జిల్లా వంగర మండలం కింజంగి గ్రామానికి చెందిన తెర్లి సత్యనారాయణ(32) సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న టీ షాపులో ఏడేళ్లుగా టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. బస్టాండు వెనుకనున్న ఆపార్ట్‌మెంటులో నివాసం ఉంటున్న సత్యనారాయణ శుక్రవారం ఉదయం దుకాణానికి వచ్చాడు. గదిలో నగదు మరిచిపోయాని క్యాషియర్ శేఖర్‌కు చెప్పి ఇంటికి వెళ్లాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో దుకాణంలో పనిచేస్తున్న మరో వ్యక్తి వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. విషయం తెలుసుకున్న దుకాణ యజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రహీం రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెమో రైలులో సాంకేతిక లోపం

డీవీసత్రంలో రెండు గంటల పాటు నిలిపివేత

దొరవారిసత్రం, మార్చి 15: నెల్లూరు - చెన్నై మధ్య నడిచే మెమో రైలులో శుక్రవారం సాంకేతిక లోపం ఏర్పడింది. ఉదయం 10.20 గంటలకు నెల్లూరు నుంచి చెన్నై బయలుదేరిన మెమో రైలు 12 గంటల ప్రాంతంలో దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపానికి చేరుకొంది. ఆ సమయంలో రైలులో ఇంజన్‌కు పవర్ అందించే ఓహెచ్‌సీ స్టాండ్ విరిగిపోయింది. గుర్తించిన లోకో పైలెట్ దొరవారిసత్రం రైల్వేస్టేషన్‌లో లూప్‌లైన్‌లో రైలును ఆపేశారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించిన సిబ్బంది విరిగిపోయిన స్టాండ్‌ను సరి చేశారు. అనంతరం రైలు చెన్నైకు బయలుదేరి వెళ్లింది. రెండు గంటల సేపు రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఆర్టీసీ బస్సులను వైసీపీ సభలకే ఇస్తారా?: పాశం



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 15: ఆర్టీసీ బస్సులను వైసీపీ సభలకు మాత్రమే ఇస్తారా అని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేటలో బీజేపీ - టీడీపీ - జనసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి బహిరంగసభకు నియోజకవర్గ పరిధి నుంచి ప్రజలు హాజరయ్యేందుకు ఆర్టీసీ బస్సులు ఇవ్వమని అధికారులను అడుగుతుంటే మీనమేషాలు లెక్కబెడుతున్నారని అన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే సిద్ధం సభలకు మాత్రం వెంటనే మంజూరు చేస్తున్నారన్నారు. ప్రధాని హాజరయ్యే సభకు బస్సులను కేటాయించాలని కోరుతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదన్నారు. మూడు పార్టీల కలయికతో వైసీపీ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, వాటంబేడు శివకుమార్, నరసింహులనాయుడు, చంద్రమౌళి, ఇశ్రాయిల్‌కుమార్, గురవయ్య, సునీల్, నాగార్జున, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కలసికట్టుగా కృషి



మాజీ ఎమ్మెల్సీ వాకాటిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

తడ, మార్చి 15: టీడీపీ విజయానికి అందరూ కలసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిని ఆయన స్వగ్రామం చేనిగుంటలో టీడీపీ నాయకులు కలిశారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయానికి మూడు పార్టీలూ కలసి పనిచేసేలా కార్యచరణ రూపొందించాలని కోరారు. వాకాటిని కలసిన వారిలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, బొమ్మన పళణి, సుధాకర్, తదితర నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన వైస్ ఎంపీపీ రమేష్, బీవీపాళెం సర్పంచు ప్రకాష్, మైనార్టీ నాయకుడు హుస్సేన్, చంద్రారెడ్డి, సూళ్లూరుపేట, దొరవారిసత్రానికి చెందిన పలువురు నేతలు వాకాటిని కలవడం చర్చనీయాంశమైంది.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థినుల సాంస్కృతి కార్యక్రమాలు

గూడూరు అర్బన్, మార్చి 15: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ నాయకుడు కనుమూరు హరిచంద్రారెడ్డి అన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడాపోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్, శ్రీహరి, హరిబ్రహ్మ, అఫ్సర్, చందన, కిరణ్మయి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను కొల్లగొట్టడంతోనే భూకంపాలు

నాయుడుపేట, మార్చి 15: ప్రకృతి సంపదను అక్రమంగా కొల్లగొట్టడం వల్లనే భూకంపాలు సంభవిస్తున్నాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలోని స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తవ్వి పక్క రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని, అలాగే కొండల్లో సైతం అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలింపు వంటి ప్రకృతి విరుద్ధ చర్యలతోనే భూకంపాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల అందజేత

నాయుడుపేట, మార్చి 15: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.52 లక్షల చెక్కులను 65మందికి లబ్ధిదారులకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, సహకారసంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, చదలవాడ కుమార్, కరీంబాయి చెంచయ్య, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌కు శంకుస్థాపన

వెంకటగిరి టౌన్, మార్చి 15: మున్సిపాలిటీలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు రూ.101కోట్లతో రెండవ సమ్మర్ స్టోరేజీ నిర్మాణానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, డిల్లీబాబు, ధనియాల రాధ, కల్యాణి, ఉమామహేశ్వరి, ఆరి శంకరయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా కోఆర్డినేటర్‌కు రివర్షన్

కోట, మార్చి 15: వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చంద్రబాబుకు రివర్షన్ ఇచ్చారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అధికారికంగా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. చంద్రబాబు ఐదు నెలలుగా గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయనపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో తిరిగి ఆయనను తిరుపతిలోని డీఆర్‌డీఏ ఆఫీసుకు పిలిపించి అక్కడే పోస్టింగ్ ఇవ్వనున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దొరవారిసత్రం, మార్చి 15: దొరవారిసత్రం మండలం తుంగమడుగు వద్ద అక్రమంగా రవాణ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకొన్నారు. బొలేరో వాహనంతో పాటు 72 బస్తాల్లో ఉన్న 3520 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను స్థానిక పోలీసులకు అప్పగించారు. బియ్యాన్ని సూళ్లూరుపేట ఎంఎల్‌సీ పాయింట్‌లో భద్రపరిచినట్లు సీఎస్ డీటీ ఓబయ్య తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ నియామకాల్లో

రూ.150 కోట్లు చేతులు మారాయి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, మార్చి 15: రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పరాకాష్టకు చేరుకున్నాయని, చివరకు ఏపీపీఎస్సీ నియామకాల్లో కూడా రూ.150 కోట్లు చేతులు మారాయని సూళ్లూరుపేట మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆరోపించారు. శుక్రవారం పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో నాయుడుపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీతో కలిసి నెలవల మీడియాతో మాట్లాడారు.ఏపీపీఎస్సీ నియామకాల్లో అవినీతికి పాల్పడడం వైసీపీ ప్రభుత్వం అవినీతి పాలనకు అద్దం పడుతోందన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ తదితర ప్రకృతి సంపదను కొల్లగొడుతూ అంతులేని అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరముందని నెలవల అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలయిక చారిత్రాత్మక అవసరమని, అదేవిధంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి నాయకత్వం రాష్ట్రానికి ఆవశ్యకమని స్పష్టం చేశారు. తన కుమార్తె నెలవల విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోవడంతో పాటు రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. కాగా, మండలంలోని తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, కానూరు పంచాయతీల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన 20 మందికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి, కందమూడి శివకుమార్, గాలి రమేష్ నాయుడు, గోపాలరెడ్డి, పేరం మధు నాయుడు, నెలవల రాజేష్, ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి, పసల చెంగయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, హరినాయుడు, గంగాబత్తిన రామకృష్ణ, శ్రీనివాసులు, భాస్కర్, బాలయ్య, గోపి, ఉచ్చూరు వెంకటయ్య, చలపతి, వెంకటేశ్వర్లు, అవధానం సుధీర్, యుంగధర్, పోలయ్య, బెన్నీ, వాసు, పరుశురాం, కేవీ నాయుడు, సత్యంరాజు సూరి నాయుడు, చక్రపాణి, బాబు, డి.సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యం రెడ్డి, నూతలపాటి ప్రసాద్ నాయుడు, రాధా నాయుడు, సిద్దులయ్య నాయుడు, రమణయ్య, ఏడుకొండలు, బాలరాజు, వెంకటేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాన్న బాటలోనే నా పయనం: లక్ష్మీ సాయిప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీ సాయిప్రియ, పక్కన కురుగొండ్ల

వెంకటగిరి, మార్చి 15: నాన్న బాటలోనే తానూ ప్రజాసేవ కొనసాగిస్తానని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ చెప్పారు. శుక్రవారం తండ్రి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. నాన్న దీవేనలు... టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆశీస్సులు, నారా లోకేశ్ ప్రోత్సాహం, నియోజకవర్గ ప్రజల మద్దతుతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నాన అడుగు జాడల్లోనే నడుస్తానని స్పష్టం చేశారు. నియోజకర్గంలో మహిళలకు ఆర్థికాభివృద్ధి, చేనేత కార్మికుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు మంగళగిరి తరహాలో వెంకటగిరిలో చేనేత నైపుణ్య సంస్థను నెలకొల్పేందుకు కృషిచేస్తామని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులను అన్ని విధాలా ఆదుకొంటామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తమ కుటుంబానికి నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీ చసే అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు రుణపడి వుంటామని చెప్పారు. తాను, తన కుమార్తె అన్నివేళల్లో అందుబాటులో వుండి సేవచేస్తామని, నియోజకవర్గ ప్రజలు తనలాగే తన కుమార్తెను కూడా ఆదరించి గెలింపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జర్ని రమణయ్య, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరాందాస్ గంగాధర్, పునుగోటి విశ్వనాధనాయుడు, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులునాయుడు, సీసీ నాయుడు, చెలికం భాస్కరరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చంగారావ్, మల్లిరం బాబు, మంకు ఆనంద్, గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు అదనపు గదుల నిర్మాణాల పరిశీలన



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి యామిని

గూడూరు, మార్చి 15: స్థానిక కోర్టు ఆవరణలో జరుగుతున్న అదనపు గదుల నిర్మాణాన్ని శుక్రవారం జిల్లా జడ్జి యామిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం, న్యాయమూర్తులు మురళీధర్, సులోచనారాణి, లోకనాధం, డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఏఈ మల్లికార్జున, న్యాయవాదులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి, మార్చి 15: వెంకటగిరి పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ మని రవిచంద్ర తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రెండు పూటటా నీటి సరఫరాకు చర్యలు

గూడూరు అర్బన్, మార్చి 15: పట్టణంలో ప్రజలకు రెండుపూటలా మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు చేపటనున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని విందూరు సమీపంలో గల వాటర్ వర్క్సును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విందూరు వాటర్‌వర్క్సులో బోర్లు, మోటార్లు మరమ్మతులు చేపట్టి పట్టణానికి రెండుపూటలా నీటిని అందించడంతో టిడ్కో గృహాలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా అందించవచ్చునన్నారు. ఈ దిశగా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, నాశిన నాగులు, బొమిడి శ్రీనివాసులు, కృష్ణప్రసాద్, తాళ్లూరు శ్రీనివాసులు, కోదండరామయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో వైసీపీ నాయకులతో వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఎంఆర్‌సీరెడ్డి సమావేశం నిర్వహించారు.

సమస్యలుంటే చెప్పండి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

నాయుడుపేట టౌన్, మార్చి 15: సాగరమాల రహదారి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు సమస్యలుంటే తెలపాలని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని అన్నారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సాగరమాల రహదారికి భూలులిచ్చిన నిర్వాసిత రైతులతో సమావేశం నిర్వహించారు. భూములిచ్చిన రైతుల ఖాతాలో పరిహారం జమ అయిందని, నగదు జమ కాని రైతులు తక్షణమే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో నాయుడుపేట తహసీల్దారు కల్యాణి, డిప్యూటీ తహసీల్దార్లు రాజేంద్ర, బెన్ని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అక్రమ బదిలీలపై యూటీఎఫ్ నిరసన

సూళ్లూరుపేట, మార్చి 15: ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను ఆపాలంటూ శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచి, అక్రమంగా బదిలీలు చేయడం అన్యాయమన్నారు. ఈ విధానాన్ని ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు ప్రభాకర్, సునీలా, రామ్మూర్తి, శ్రీనివాసులు, వెంకటస్వామి, రాజేశ్వరి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సమావేశానికి వస్తేనే చేయూత

వాకాడు, మార్చి 15: వాకాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో చేయూత చెక్కుల పంపిణీ శుక్రవారం జరిగింది. అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకు ఈ సమావేశానికి వలంటీర్లు బలవంతంగా జనసమీకరణ చేసి తరలించారు. సమావేశానికి వస్తేనే చేయూత నిధులు మంజూరు చేస్తామని, లేదంటే డబ్బులు రావని వలంటీర్లు లబ్ధిదారులకు చెప్పారు. వ్యవసాయం, ఇతర పనులు ఉన్నాయని చెప్పినా, వినకుండా ఇంటింటికీ వెళ్లి బలవంతంగా మహిళలను సమావేశానికి ఆటోల్లో తరలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు రౌతు రామకృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, తిప్పల వెంకటయ్య, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, కామిరెడ్డి కస్తూర్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోట, మార్చి 15: ఆధార్, మీసేవా కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న సేవల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో) వాణిరెడ్డి హెచ్చరించారు. కోట తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఆధార్ కేంద్రం, పట్టణంలోని పలు మీసేవా కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని విభాగాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె వెంట ఎంపీడీవో శంకరయ్య ఉన్నారు.

ఎన్నికల నిబంధనల అమలు పట్ల

అప్రమత్తంగా వ్యవహరించాలి

కోట, మార్చి 15: ఎన్నికల నిబంధనల అమలు పట్ల అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దారు నాగరాజురావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నిబంధనలపై వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. మరి కొన్నిగంటల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలు, బహిరంగ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల పోస్టర్లు, వాల్‌పోస్టర్లపై నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీపూజ

గూడూరు, మార్చి 15: మండలంలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీపూజ నిర్వహించారు. తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థినిలు మంచిమార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

డక్కిలి, మార్చి 15: తనను గెలిపిస్తే వెంకటగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక తిరుపతి పార్లమెంటు ఎంపీ అభ్యర్థి గద్దల మునెయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఆల్తూరుపాడు, మార్లగుంట దళితవాడల్లో పర్యటించి తనకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్కే రఫీ పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

గూడూరు, మార్చి 15: మండలంలోని కొండాగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణంరాజు దాతృత్వంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పంటనమోదు పత్రాల పంపిణీ

దొరవారిసత్రం, మార్చి 15: రబీ సీజన్‌లో పంట నమోదు(ఈక్రాప్) ధృవీకరణ పత్రాలను వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందిస్తున్నారు. మండలంలో 4671 మంది రైతులకు సంబంధించిన 11070 ఎకరాల్లో పంట నమోదు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారి జ్యోతిర్మయ్ తెలిపారు. వీరందరికీ రెండు రోజుల నుంచి ధృవీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

చేయూత చెక్కుల పంపిణీ

చిల్లకూరు, మార్చి 15: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ రావు చేయూత చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీవో భానుమూర్తిరావు, ఏపీఎం గున్నయ్య యమునమ్మ, నారాయణ, సనత్‌కుమార్‌రెడ్డి, శారదమ్మ, దిలీప్‌కుమార్‌రెడ్డి, సుమలత, రాజేష్, అశోక్ పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయండి

గూడూరు, మార్చి 15: రానున్న ఎన్నికలలో టీడీపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జాతీయ రహదారి సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ పరిధిలోని నాయకులతో ఎన్నికల ప్రచార నిర్వహణ, పోలింగ్ పర్యవేక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ఎంతో కీలకమైనవని, అందరం ఐక్యమత్యంతో కష్టపడి పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేద్దామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఈనెల 17న చిలకలూరుపేటలో జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, గణపర్తి కిషోర్‌నాయుడు, సర్వోత్తమరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే యువతకు ఉపాధి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశం జశ్వంత్‌కుమార్

గూడూరు, మార్చి 15: చంద్రబాబునాయుడుతోనే యువతకు ఉపాధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కుమారుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ధర్మరాజస్వామి గుడి ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వైసీపీ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నో పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతిని అందజేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో యువత టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బత్తిన సుధాకర్, వాటంబేడు శివకుమార్, భయ్యా మోమన్‌రావు, సోమిశెట్టి చెంచురామయ్య, నీలిశెట్టి ఉమాశంకర్, రవీంద్రరెడ్డి, సిద్దయ్యానాయుడు, గాయం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌కు అధికారుల డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపీనాథ్

వాకాడు, మార్చి 15: మండల సర్వసభ్య సమావేశానికి తరచూ అధికారులు గైర్హాజరవుతున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చ, పరిష్కారాలకు వేదికైన సమావేశానికి అధికారులు విధిగా హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, తహసీల్దారు నరసింహరావు, ఎంపీడీవో గోపీనాథ్, ఏఎంసీ చైర్ పర్సన్ నాగభూషణమ్మ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలనికి వేతనాలివ్వండి

గూడూరు, మార్చి 15: పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె కాలానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలను చెల్లించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గతేడాది డిసెంబరు 26నుంచి జనవరి 10వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సమ్మెలో పాల్గొనడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా సమ్మె చేసిన 16 రోజులకు వేతనాలు ఇవ్వలేదన్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను అందజేయాలన్నారు. అనంతరం కార్యాలయ ఏవో నౌషద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, శ్రీనివాసులు, రమేష్, కోటేశ్వరరావు, మురళి, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం

నాయుడుపేట, మార్చి 15: సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ స్థలం కేటాయించినప్పటికీ పెట్టుబడులకు బ్యాంకు రుణాలు సక్రమంగా మంజూరుకాకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం అన్నారు. మేనకూరు సెజ్‌లో శుక్రవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ రకాల రుణాల గురించి వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు దీపక్ రాగూర్, రామకృష్ణ, ఎస్ఐడీబీఐపీఎంయూ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాయల్ కాప్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా కృష్ణయ్య

వెంకటగిరి, మార్చి 15: రాయల్ కాప్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడుగా తోట కృష్ణయ్య నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర కాప్‌రాక్స్ అధ్యక్షురాలు బోళ్ల దేవినాయుడు నియామక పత్రాన్ని కృష్ణయ్యకు అందజేశారు.